VISION BHARATH REPORTER
విభారె
VIBHARE TELUGU DAILY
విలేఖరులు కావలెను
గత ఐదు సంవత్సరాల నుండి నిరంతరాయంగా వెలువడుతున్న
'విభారె' తెలుగు దినపత్రికకు
ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ లోని అన్ని జిల్లా కేంద్రాలో
బ్యూరోలు మరియు స్టాఫ్ రిపోర్టర్లు కావలెను.
కర్నూలు జిల్లాలోని అన్ని నియోజకవర్గ మరియు
మండలాల వారీగా విలేఖరులు కావలెను
ఆవుల విజయభాస్కర్ రెడ్డి
ఎడిటర్ అండ్ పబ్లిషర్,
8143193697, 9440232308

www.vibharenews.com
# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY

ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
ఆవుల విజయభాస్కర రెడ్డి
ఆళ్లగడ్డ
9440232308,9494498787


PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి మంగళవారం 25-04-2023 సంపుటి : 04 సంచిక : 207 పేజీలు : 4 వెల : రూ 3-00

## వైఎస్సార్ యంత్రసేవా పథకం కింద కిసాన్ డ్రోన్లు: సీఎం జగన్



తాడేపల్లి: ఆంధ్రప్రదేశ్ వ్యవసాయం, సహకారం, మార్కెటింగ్, పౌర సరఫరాల శాఖలపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో సమీక్ష చేపట్టారు. ఈ సమీక్ష సమావేశానికి మంత్రులు కాకాని గోవర్ధనరెడ్డి, కారుమూరి నాగేశ్వరరావు, అలాగే సీఎస్ జవహర్ రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రబీలో ఇ- క్రాప్ బుకింగ్‌పై అధికారులు సీఎంకు వివరాలు అందించారు. 3953 ఆర్బీకే స్థాయి కమ్యూనిటీ హైరింగ్ సెంటర్లు (సీహెచ్‌సీ)లకూ, 194 క్లస్టర్ స్థాయి సీహెచ్‌సీలకూ మే 20 లోగా వైయస్సార్ యంత్రసేవ కింద వ్యవసాయ ఉపకరణాలు అందిస్తున్నట్టు అధికారులు వెల్లడించారు. వైయస్సార్ యంత్రసేవా పథకం కింద జులై నాటికి 500 కిసాన్ డ్రోన్లు.. డిసెంబర్ నాటికి 1500కు పైగా డ్రోన్లు ఇచ్చే దిశగా వ్యవసాయశాఖ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అయితే, ఖరీఫ్ ప్రారంభానికి ముందు మే నెలలో రైతు భరోసా ఇన్‌స్టాల్‌మెంట్ ఇచ్చేందుకు సిద్ధం కావాలని అధికారులను సీఎం జగన్ ఆదేశించారు. మే 10 నాటికి అర్హులైన రైతుల జాబితాలను గ్రామ సచివాలయాల్లో ప్రదర్శిస్తామని అధికారులు ఈ సందర్భంగా సీఎంకు తెలిపారు. 467 వీఏఏ, 1644 వీహెచ్ఏ, 23 వీఎస్ఏ, 64 వీఎఫ్ఏ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. 4656 ఏనిమల్ హస్బెండరీ అసిస్టెంట్ల పోస్టుల భర్తీకీ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఖరీఫ్ సీజన్లో రైతుల దగ్గరనుంచి సేకరించిన ధాన్యానికి దాదాపుగా చెల్లింపులు పూర్తయ్యాయని.. రూ.7233 కోట్లకు గానూ రూ.7200 కోట్లు చెల్లించినట్లు సీఎం జగన్‌కు అధికారులు వివరించారు. ఖాతాల్లో సాంకేతిక పరమైన ఇబ్బందులు కారణంగా రూ.33 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. దీనిపై సీఎం స్పందిస్తూ.. ప్రతి ఆర్బీకే పరిధిలో ఒక గోడౌన్ ఉండాలన్న కార్యాచరణ దిశగా ముందుకు సాగాలని సూచించారు. 1005 చోట్ల గోడౌన్ల నిర్మాణం చేపట్టామని అధికారులు తెలిపారు. వీటిలో 206కు పైగా పూర్తయ్యాయని, మరో 93 గోడౌన్లు తుదిమెరుగులు దిద్దుకుంటున్నాయని, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయని అధికారులు చెప్పారు.

## అవినాష్ ముందస్తు బెయిల్ ఉత్తర్వులు నిలిపివేసిన సుప్రీం



దిల్లీ: మాజీ మంత్రి వివేకా హత్య కేసులో కడప ఎంపీ అవినాష్ రెడ్డికి బెయిల్ వ్యవహారంపై వివేకా కుమార్తె సునీత సుప్రీం కోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై వాదనలు ముగిశాయి. ఆమె తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా, అవినాష్ తరఫున మరో సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు. వాదనలు విన్న సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం.. తెలంగాణ హైకోర్టు ఉత్తర్వులను పూర్తిగా పక్కన పెట్టింది. అవినాష్ ముందస్తు బెయిల్ ఉత్తర్వులను నిలిపివేసింది. తెలంగాణ హైకోర్టు అలాంటి ఉత్తర్వులు జారీ చేయకూడదని స్పష్టం చేసింది.. సీబీఐకి హైకోర్టు అలాంటి నిబంధనలను విధించడం సరికాదని పేర్కొంది. హైకోర్టు ఆదేశాల వల్ల సీబీఐ దర్యాప్తుపైనా ప్రభావం పడుతుందన్న సుప్రీం.. జూన్ నెలాఖరు వరకు సీబీఐ దర్యాప్తు గడువును పొడిగించింది. ఈ నెల 25 వరకు అవినాష్‌ను అరెస్టు చేయొద్దంటూ హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను సవాల్ చేస్తూ సునీత సర్వోన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. గత శుక్రవారం ఈ పిటిషన్‌పై తొలిసారిగా విచారణ చేపట్టిన న్యాయస్థానం హైకోర్టు ఉత్తర్వులను తప్పుబట్టింది. తాజాగా సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం ఇవాళ మరోసారి విచారణ చేపట్టింది. మరోవైపు ఈనెల 25 వరకు అరెస్టు చేయవద్దని అవినాష్ న్యాయవాదులు ధర్మాసనాన్ని కోరారు. మంగళవారం హైకోర్టులో కేసు విచారణ ఉన్నందున అప్పటి వరకు అరెస్టు చేయొద్దని విజ్ఞప్తి చేశారు. అలాంటి ఆదేశాలు ఇవ్వలేమని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. ఈ విజ్ఞప్తిని మన్నిస్తే ఉత్తర్వులు పరస్పరం విరుద్ధంగా ఉంటాయన్నారు. మరోవైపు విచారణ సమయంలో నిందితులకు సీబీఐ లిఖితపూర్వక ప్రశ్నలు ఇవ్వాలనడం అసమంజసమని సర్వోన్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి విచారణకు హాజరుకావాలంటూ సీబీఐ అధికారులు ఈ నెల 16న నోటీసులు జారీ చేశారు. అక్కడికి రెండు రోజుల వ్యవధిలోనే ఆయన తండ్రి భాస్కర్‌రెడ్డి, ఉదయకుమార్ రెడ్డిలను పోలీసులు అరెస్టు చేయడంతో.. అవినాష్‌రెడ్డి ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం ఈ నెల 25 వరకు అరెస్ట్ చేయవద్దంటూ సీబీఐని ఆదేశించింది. అయితే అప్పటి వరకు సీబీఐ కార్యాలయంలో ప్రతి రోజూ విచారణకు హాజరుకావాలని అవినాష్‌రెడ్డికి షరతు విధించింది. అవినాష్‌కు ప్రశ్నలను రాతపూర్వకంగా ఇవ్వాలని.. విచారణను ఆడియో, వీడియో రికార్డు చేయాలని సీబీఐకి ఆదేశిస్తూ.. మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 25న తుది ఉత్తర్వులు జారీ చేస్తామంటూ విచారణను వాయిదా వేసింది. దీనిపై వివేకా కుమార్తె సునీత సుప్రీం కోర్టును ఆశ్రయించారు.

## ఆ ముసుగులో రాజధాని మాస్టర్‌ప్లాన్ విధ్వంసానికి కుట్ర: అమరావతి రైతులు

అమరావతి: ఆర్-5 జోన్‌పై రాజధాని అమరావతి ప్రాంత రైతులు తమ పోరాటాన్ని ఉద్ధృతం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తీరును నిరసిస్తూ ఆర్-5 జోన్ పరిధి ప్రాంతాల్లో 'ప్రజాచైతన్య పాదయాత్ర' చేపట్టారు. మంగళగిరి, తాడికొండ నియోజకవర్గాల్లో రైతుల పాదయాత్ర కొనసాగుతోంది. కృష్ణాయపాలెం, మందడం, ఐనవోలు, కురగల్లు మీదుగా నిడమర్రు వరకు నడవనున్నారు. పాదయాత్ర అనంతరం సాయంత్రం నిడమర్రులో బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ పేదలకు ఇళ్ల స్థలాల ముసుగులో రాజధాని అమరావతి మాస్టర్ ప్లాన్ విధ్వంసానికి కుట్ర జరుగుతోందని మండిపడ్డారు. ఆర్-5 జోన్ రద్దు చేసేవరకు పోరాటం కొనసాగుతుందని తేల్చిచెప్పారు.



## యువగళానికి భారీ ఎత్తున స్పందన




**మూడు జిల్లాలు దాటి...**
**1000 కిలోమీటర్లు దాటిన లోకేశ్ యాత్ర**

తిరుపతి, ఏప్రిల్ 22, యువగళం పాదయాత్ర నిర్దేశించుకున్న లక్ష్యానికి అనుగుణంగా అడుగులు పడుతున్నాయా లేదా అన్నది గమనించాల్సిన బాధ్యత, ఆ యాత్ర ప్రభావం ప్రజల మీద ఎంత ఉంది? తదితర అంశాలను పరిశీలించాల్సిన బాధ్యత రాజకీయ సామాజిక అధ్యాయనసంస్థగా మాపై బాధ్యత ఉంది. అందులో భాగంగానే యువగళం పాదయాత్ర జరిగిన ఉమ్మడి చిత్తూరు, అనంతపురం, కర్నూలు జిల్లాలో వారం రోజులపాటు క్షేత్రస్థాయిలో పర్యటించి వివిధ అంశాలను పరిశీలించడం జరిగింది. అందులో భాగంగానే ఈ విశ్లేషణ. పాదయాత్ర ఒక లక్ష్యం కోసం సాగుతుంది. ఆ లక్ష్యంలో భాగంగా మొదటిది యువగళం పాదయాత్రతో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు యాక్టివేట్ అవుతున్నారు. రెండోది తనను తాను ఒక సమర్ధవంత నాయకుడిగా నిరూపించుకున్నారు. మూడోది తన చుట్టూ ఉండే నాయకుల మాటల తాలూకు 'ఎకో చాంబర్' ని దాటుకొని, క్షేత్ర స్థాయి రియాలిటీకి దగ్గరగా వస్తున్నారు. అంటే, ప్రజల్లో ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను ఈ పాదయాత్ర ద్వారా కూడగడుతున్నారు. యువగళం పాదయాత్ర ద్వారా ఈ మూడు లక్ష్యాలను చేరుకోవడంలో విజయం సాధించారు. ఈ మూడు లక్ష్యాలు నారా లోకేశ్‌ని నాయకుడిగా మరో మెట్టు ఎక్కించే సోపానాలే. ఈ లక్ష్యాలు సాధించడానికి లోకేశ్ ఒక కొత్త రాజకీయ వ్యూహాన్ని ఎంచుకున్నారు. అదే "కాన్ఫ్లిక్ట్, కన్‌ఫ్రంటేషన్" పద్ధతి. అంటే, ముందుగా స్థానిక వైఎస్ఆర్‌సిపి ఎమ్మెల్యేలపై ఆరోపణలు చేస్తూ ఆయన తిరుగుతున్న నియోజవర్గంలో సంఘర్షణ సృష్టిస్తూ వైఎస్సార్సీపీ శ్రేణుల ఆత్మవిశ్వాసం మీద దెబ్బకొడుతున్నారు. దీనితో అధికార వైఎస్ఆర్‌సిపి నాయకులు, కార్యకర్తలు ఆత్మరక్షణలో పడుతున్నారు. దీంతోపాటు అప్పటి వరకు స్థానికంగా ఉన్న అధికారపార్టీ ఎమ్మెల్యేలు, నాయకుల బండారం బట్టబయలు అవ్వడంతో ఈ అంశం ప్రజల్లో చర్చకు దారితీసి వైఎస్ఆర్‌సిపి ప్రతిష్ట ప్రజల్లో కోల్కోలేని విధంగా దెబ్బతింటోంది. నారాలోకేష్ చేపట్టిన ఈ వ్యూహం వల్ల అంతకుముందు వైఎస్సార్సీపీ ప్రభుత్వం కేసులు పెడతారని భయపడిన జనం, తెలుగుదేశం కార్యకర్తలు కూడా ధైర్యంగా అడుగు బయటపెడుతున్నారు. ఫలితంగా కేవలం పాదయాత్ర చేస్తున్న జిల్లాల్లోనే కాకుండా, రాష్ట్ర వ్యాప్తంగా నాయకులు వైఎస్సార్సీపీ నాయకులపై సవాల్ విసురుతున్నారు. జనవరి 27 వ తేదీన చిత్తూరు జిల్లాలో కుప్పం నియోజకవర్గంలో "యువగళం" పాదయాత్ర ప్రారంభమైంది. చిత్తూరు జిల్లాలో అడుగడుగునా అడ్డంకులు ఎదుర్కొన్న లోకేశ్, తన పాదయాత్రను విజయవంతంగా రెండో దశలోకి తీసుకెళ్లారు. చిత్తూరు జిల్లాలో దాదాపు 5 నియోజకవర్గాల్లో పాదయాత్రకు తగినంత స్పందన రాలేదు. పెద్ద ఎత్తున ప్రజలూ, కార్యకర్తలు పాదయాత్రలో పాల్గొనలేదు. పైగా అక్కడ ప్రజల మాటలను బట్టి చూస్తే, ఒక రకంగా ఈ 5 నియోజకవర్గాల్లో యువగళం విఫలమైందనే చెప్పొచ్చు. కాగా, ఇటీవల జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ విజయమే, యువగళానికి పెద్ద మలుపు! ఆ విజయం టీడీపీ కార్యకర్తల్లో ఉత్సాహం పెరగడానికి కారణమైంది. దీంతో ఎమ్మెల్సీ ఎన్నికల విజయం తర్వాత అనంతపురం జిల్లాకు చేరిన పాదయాత్ర ప్రభావం రెట్టింపయింది. టీడీపీ కార్యకర్తలు చురుకుగా యువగళం పాదయాత్రలో పెద్ద ఎత్తున భాగస్వాములవుతున్నారు. "కాన్ఫ్లిక్ట్, కన్‌ఫ్రంటేషన్" పద్ధతిలో భాగంగానే ఎమ్మెల్యేలపై విమర్శల విల్లులు ఎక్కుపెడుతున్నారు నారా లోకేశ్. పాదయాత్ర చేస్తున్న నియోజకవర్గాల్లో ముందుగానే వైఎస్ఆర్‌సిపి ఎమ్మెల్యేల అవినీతి చిట్టా, వారిదందాలు పూర్తి వివరాలు తెప్పించుకుంటున్నారు. ఆ ఎమ్మెల్యేలు చేసిన అవినీతి, చేస్తున్న అన్యాయాలు, కబ్జాలు, దందాలపై బహిరంగసభల్లో వారిచిట్టాను బయటపెడుతూ అధికార వైఎస్ఆర్‌సిపి నేతలను చికాకు పరుస్తున్నారు.

## అప్రమత్తంగా ఉండండి..

**జనసైనికులకు పవన్ బహిరంగలేఖ**

అమరావతి: జనసైనికులు అప్రమత్తంగా ఉండాలని.. మాట్లాడేముందు వాస్తవాలను నిర్ధారించుకోవాలని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ సూచించారు. ఈ మేరకు జనసేన నాయకులు, వీరమహిళలు, జనసైనికులను ఆయన బహిరంగ లేఖ రాశారు. కుట్రలకు పాల్పడుతున్నట్లు సమాచారం.."ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి, ప్రజాశ్రేయస్సు కోసం మనం శ్రమిస్తున్న తరుణంలో మన దృష్టి మళ్లించేందుకు, భావజాలాన్ని కలుషితం చేసేందుకు కొన్ని శక్తులు నిరంతరం పనిచేస్తున్నాయి. మన పార్టీ పట్ల ఉన్న సానుకూల దృక్పథాన్ని దెబ్బతీసే కల్పిత సమాచారాన్ని శ్రేణులకు చేర్చి కుట్రలకు పాల్పడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం ఉంది. వాటిని మనం అర్థం చేసుకుని పార్టీ నాయకులు, శ్రేణులు ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉంది. ప్రతి విమర్శలు, తీవ్రమైన ఆర్థిక నేరాల గురించి మాట్లాడాల్సి వచ్చినపుడు ముందుగా పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ దృష్టికి తీసుకెళ్లండి. వారి సూచనలు, సలహా మేరకు మాట్లాడండి. పార్టీలోని నాయకులు, వీరమహిళలు, జనసైనికులు మాట్లాడే ప్రతి మాట పార్టీపై ప్రభావం చూపుతుంది. అందుకే పార్టీలోని ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా వ్యవహరిస్తూ మాట్లాడే ముందు వాస్తవాలను నిర్ధారించుకోవాలి. స్థాయి, తీవ్రత హద్దులు దాటినట్లు సభ్య సమాజం భావించని విధంగా మన మాటలు ఉండాలి. ఒక వ్యక్తి గురించి మాట్లాడే సమయంలో అకారణంగా వారి కుటుంబ సభ్యుల పేర్లను ప్రస్తావించవద్దు. ఆధారాలు లేకుండా నేరారోపణలు చేయొద్దు.. అది పార్టీకి, సమాజానికి మంచిది కాదు. నన్ను విమర్శించే వారికీ, వ్యక్తిగతంగా దూషించే వారికి బదులు చెప్పే సమయంలో నేను చాలా అప్రమత్తంగా ఉంటానన్న సంగతి మీ అందరికీ తెలిసిందే. ప్రతి అక్షరాన్ని, మాటను బేరీజు వేసుకుంటూ హద్దులు దాటకుండానే కొంత తగ్గి బదులు చెబుతాను. ఎందుకంటే మన నుంచి వచ్చే ప్రతీ మాటకు అంత బలం ఉంటుంది.. ఆ బలం అపసవ్యంగా మారకూడదు. సరైన ధ్రువపత్రాలు లేకుండా ఎవరిపైనా ఆర్థిక నేరారోపణలు చేయొద్దు. మీడియాలో వచ్చిందనో.. ఎవరో మాట్లాడారనో నిర్ధారణ కానీ అంశాలపై చెప్పొద్దు. పొత్తులపై సోషల్ మీడియాలో వచ్చే సమాచారం ఆధారంగా మాట్లాడకండి. ఈ విషయంలో మేలు చేసే నిర్ణయం నేనే స్వయంగా తీసుకుంటా. సయోధ్యగా ఉన్న రాజకీయపక్షాల్లో చిన్నా చితకా నాయకులు మనపై ఏమైనా విమర్శలు చేస్తే వాటిని ఆ నాయకుడి వ్యక్తిగత విమర్శలుగా భావించండి. వాటిని ఆయా పార్టీలకు ఆపాదించవద్దు" అని పవన్ బహిరంగ లేఖలో పేర్కొన్నారు.



## జగన్ ప్రభుత్వంపై ఇప్పుడిప్పుడే తాను విమర్శలు చేయబోను

**మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు**



అమరావతి ఏప్రిల్ 24 జగన్ ప్రభుత్వంపై ఇప్పుడిప్పుడే తాను విమర్శలు చేయబోనని రాజమండ్రి మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎందుకు విమర్శలు చేయవని అడిగేవారికి ఆ అర్హత లేదన్నారు. రామోజీ రావు ఆగ్రహిస్తే ఏదో జరిగిపోతుందనే రోజులు పోయాయన్నారు. రామోజీరావు మార్గదర్శి అక్రమాలు-నిజానిజాలు అనే అంశంపై విజయవాడలో స్వర్ణాంధ్ర పత్రిక ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. ఇందులో పాల్గొన్న ఉండవల్లి అరుణ్ కుమార్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈనాడు పత్రికలో వ్యతిరేకంగా రాస్తే ఏదో జరిగిపోయే రోజులు పోయాయన్నారు. గతంలో రాజమండ్రిలో ఎంపీగా పోటీ చేసినప్పుడు తనను ఓడించేందుకు రామోజీరావు ఎంతో ప్రయత్నించినా తాను గెలిచానని గుర్తు చేశారు. ఇప్పుడు జగన్ ప్రభుత్వం పట్ల కూడా ఈనాడు పత్రిక అలాగే వ్యవహరిస్తోందని మండిపడ్డారు. రామోజీరావు తాను చట్టాలను పట్టించుకోనంటారని.. చట్టాలకు అతీతమన్నట్లుగా వ్యవహరిస్తారని ఉండవల్లి నిప్పులు చెరిగారు. తనను ఎవరూ ప్రశ్నించడానికి వీల్లేదని రామోజీరావు వాదిస్తారని తప్పుబట్టారు. తాను ఆర్థిక అక్రమాలకు పాల్పడినా ఎవరూ అడగకూడదనే వితండవాదం రామోజీదన్నారు. గత 60 ఏళ్లుగా తన అక్రమాలను ఎవరూ ప్రశ్నించలేదు కాబట్టి ఇప్పుడూ అడగడానికి వీల్లేదని రామోజీరావు భావిస్తున్నారని ఉండవల్లి అరుణ్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రామోజీరావు లాంటి వారిని వదిలేస్తే దేశంలో అతిపెద్ద మాఫియా సామ్రాజ్యం తయారవుతుంది అని ఉండవల్లి ఘాటు వ్యాఖ్యలు చేశారు. మార్గదర్శి ఫైనాన్షియర్స్ విషయంలోనూ 2006లో రామోజీరావు అడ్డగోలుగా వాదించారని ఉండవల్లి గుర్తు చేశారు. హిందూ అవిభక్త కుటుంబం (హెచ్యూఎఫ్) కాబట్టి ప్రజల నుంచి డిపాజిట్లు వసూలు చేయవచ్చన్న రామోజీరావు వాదనను ఆర్బీఐ తిరస్కరించిందని గుర్తు చేశారు. ప్రజల నుంచి డిపాజిట్లు వసూలు చేయకూడదని ఆర్బీఐ రామోజీరావుకు స్పష్టం చేసిందన్నారు. రామోజీరావు సైతం ప్రజల నుంచి రూ.2600 కోట్లు డిపాజిట్లు సేకరించడం తప్పని ఆర్బీఐ వద్ద అంగీకరించారని గుర్తు చేశారు. ఆ డిపాజిట్లను వెనక్కి ఇచ్చేస్తున్నట్లు లిఖితపూర్వకంగా పేర్కొన్నారని వివరించారు. కానీ ఎవరెవరి నుంచి డిపాజిట్లు వసూలు చేశారో చెప్పుమంటే మాత్రం చెప్పడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ డిపాజిట్దారుల వివరాలు తెలియచేయాలని ఇటీవలే సుప్రీం కోర్టు ఆదేశించిందని గుర్తు చేశారు. అదేవిధంగా మార్గదర్శి చిట్ఫండ్స్ ను నిర్వహిస్తున్న రామోజీరావు అసలు తాను కేంద్ర చిట్ ఫండ్ చట్టాన్ని పట్టించుకోనని సీఐడీ విచారణలో వాదించడం బరితెగింపు అని ఉండవల్లి అరుణ్ కుమార్ ధ్వజమెత్తారు. చిట్ ఫండ్ సంస్థలు తమ చందాదారుల నుంచి వసూలు చేసే సొమ్మును జాతీయ బ్యాంకులో డిపాజిట్ చేయాలని చట్టంలో ఉందని గుర్తు చేశారు.

# సంపాదకీయం

మంగళవారం 25-04-2023

## మస్క్... కిక్కే వేరప్పా..

ఎలాన్ మస్క్ పరిచయం అక్కర్లేని పేరు. అంతర్జాతీయ వ్యాపార దిగ్గజం. ఆయన ఏం చేసినా సంచలనమే. ఎలాన్ మస్క్ ఎప్పుడూ వివాదాల్లోనే ఉంటారు. టెస్లా కంపెనీ సిఇఒగా ప్రపంచ మంతటా ఆయన పాపులర్. కిందటేడాది అక్టోబరులో ప్రపంచం లోనే అతి పెద్ద సోషల్ మీడియా వేదిక ట్విట్టర్‌ను ఆయన కొనుగోలు చేశారు. అప్పటి నుంచి మస్క్ మరింతగా వివాదాల్లో కూరుకు పోయారు. ట్విట్టర్‌లో ఎలాన్ మస్క్ అనేక కీలక మార్పులు చేశాడు. కొన్ని రోజుల కిందట ట్విట్టర్ ఐడెంటిటీని మార్చేశారు. బ్లూ బర్డ్ లోగోను మార్చి వేసి ఆ స్థానంలో కుక్కపిల్లను పెట్టారు. తాజాగా ట్విట్టర్ యూజర్లకు ఎలాన్ మస్క్ ఓ బంపర్ ఆఫర్ ఇచ్చారు. ట్విట్టర్ యూజర్లు తాము పోస్ట్ చేసే కంటెంట్ నుంచి నాలుగు డబ్బులు సంపాదించుకోవడానికి అవకాశం ఇచ్చారు.ఇంటర్నేషనల్ కార్పొరేట్ దిగ్గజం ఎలాన్ మస్క్ చేతుల్లో పడ్డాక ట్విట్టర్‌లో అనేక మార్పులు జరుగుతున్నాయి. తాజాగా ట్విట్టర్ యూజర్లకు బంపర్ ఆఫర్ ఇచ్చారు. యూజర్లు తమ కంటెంట్ నుంచి డబ్బులు సంపాదించుకునేందుకు అనుమతి ఇస్తున్నట్లు వెల్లడించారు ఎలాన్ మస్క్. సుదీర్ఘ సమాచారం నుంచి ఎక్కువ నిడివి కలిగిన వీడియోల వరకు దేనికైనా సబ్‌స్క్రిప్షన్ ఆప్షన్‌ను పెట్టుకోవచ్చని మస్క్ వెల్లడించారు. కంటెంట్ క్రియేట ర్లు తమ వీడియోలకు సబ్‌స్క్రిప్షన్ ఆప్షన్‌ను పెట్టుకోవచ్చని మస్క్ వెల్లడిం చారు. వాటి ద్వారా సొమ్ములు సంపాదించు కోవచ్చన్నా రు. అయితే ట్విట్టర్ యూజర్లకు ఇచ్చిన ఈ బంపర్ ఆఫర్ ప్రస్తుతం అమెరికా వరకే పరిమితం. అయితే త్వరలో మిగతా దేశాలకు కూడా విస్తరిస్తామన్నారు ఎలాన్ మస్కార్పొరేట్ దిగ్గజం ఎలాన్ మస్క్ తాజా నిర్ణయం వెనుక ఓ వ్యూహం ఉండి ఉండొచ్చంటున్నారు టెక్ నిపుణులు. కంటెంట్ క్రియేటర్లను ట్విట్టర్‌లోకి ఆహ్వానించడానికే మస్క్ ఈ నిర్ణయం తీసుకుని ఉండొచ్చంటున్నారు. అలాగే కంటెంట్ నుంచి సొమ్ము లు సంపాదించుకునే ఆప్షన్‌ను యూజర్లకు కల్పించడం ద్వారా ప్రముఖ న్యూస్ లెటర్ సంస్థ సబ్‌స్టాక్‌కు పోటీనివ్వడం కూడా మస్క్ వ్యూహం అయిఉండొచ్చంటున్నారు టెక్ నిపుణులు. ట్విట్టర్ ఐడెంటిటీని ఎలాన్ మస్క్ మార్చేశారు. చాలా కాలం పాటు నీలిరంగు పిట్ట ట్విట్టర్ లోగోగా ఉండేది. అయితే కొన్ని రోజుల కిందట బుల్లిపిట్టను తరిమేసి ఓ కుక్కపిల్ల లోగో స్థానం లోకి వచ్చింది. ట్విట్టర్ అధినేత ఎలాన్ మస్క్ ఈ మేరకు అకస్మాత్తుగా ఓ నిర్ణయం తీసుకున్నారు.ట్విట్టర్ కొనుగోలు చేసినప్పటి నుంచీ ఎలాన్ మస్క్ పేరు మీడియాలో హల్‌చల్ అవుతోంది. ఎంతగా హల్‌చల్ అవుతుందో, అంతగా వివాదాస్పదం కూడా అవుతోంది. ఎలాన్ మస్క్‌కు ఇతర దేశాలతో ఉన్న వ్యాపార సంబంధాలపై డేగకన్ను వేయాల్సిన అవసరం ఉందని అమెరికా ప్రెసిడెంట్ జో బైడెన్ కామెంట్ చేశారు. ట్విట్టర్ కొనుగోలు విషయంలో సౌదీఅరేబియకు చెందిన కొందరు ప్రముఖులు ఎలాన్ మస్క్‌కు అండగా పెట్టుబడులు పెట్టారన్న వార్తలు మీడియాలో హల్‌చల్ చేశాయి. దీనిపై అమెరికా ప్రెసిడెంట్ జో బైడెన్ స్పందించారు. మస్క్ వ్యాపార సంబంధాల నేపథ్యంలో అమెరికాకు భద్రతపరంగా ఏమైనా ఇబ్బందులు ఎదురవుతాయా అనే అంశాన్ని పరిశీలించాల్సి ఉందని జో బైడెన్ అన్నట్లు వార్తలొచ్చాయి.ఎలాన్ మస్క్ తాను అనుకున్నది చేసే రకం. పరిణామాలు ఎలా ఉంటాయన్న విషయాన్ని ఏమాత్రం పట్టించుకోరు. ట్విట్టర్ కొనుగోలు చేయాలని ఎలాన్ మస్క్ ఎప్పట్నుంచో అనుకున్నార ట. అయితే ట్విట్టర్‌లోని కొంత మంది ఉన్నతాధికా రులకు తమ సంస్థను ఎలాన్ మస్క్ కొనడం ఇష్టం లేదట. ఈ నేపథ్యంలో ట్విట్టర్ డీల్ లేటయ్యింది. ట్విట్టర్ తన చేతుల్లోకి రాగానే సంబంధిత డీల్ లేట్ అవడానికి కారణమని భావించిన కొంత మంది ఉన్నతాధికారుల ను ఎలాన్ మస్క్ అప్పటికప్పుడు ఇంటికి పంపారు. వర్క్ ఫ్రం హోమ్ విషయంలోనూ ఎలాన్ మస్క్ చాలా స్ట్రిక్ట్‌గా వ్యవహరిం చారన్న పేరుంది. కరోనా తీవ్రత తగ్గిన నేపథ్యంలో టెస్లా ఉద్యోగులు కూడా ఆఫీసులకు వచ్చి చేయాల్సిందేనని ఎలాన్ మస్క్ హుకుం జారీ చేశారు. ఆఫీసుకు రాలేని వాళ్లు, ఎంచక్కా ఉద్యోగాలు మానేయవచ్చన్నారు.ఆచితూచి మాట్లాడటం అనేది ఎలాన్ మస్క్ డిక్షనరీలోనే లేదు. ఆ టైమ్‌కు ఏది కరెక్ట్ అనిపిస్తే అలాగే మాట్లాడతారు. వెనకా ముందు ఆలోచించడం మస్క్ మహాశయుడికి చేతకాదు. ఇప్పటికైతే ఎలాన్ మస్క్ ఓ వ్యాపార దిగ్గజం. ప్రపంచ వ్యాప్తంగా పేరున్న కార్పొరేట్ అధినేత. అయితే ఆయన జీవితంలో బోలెడు పరాజయాలున్నాయి. జీవితపు తొలి రోజుల్లో ఎలాన్ ఒక ఫెయిల్యూర్. ఒక దాని వెంట మరొకటిగా పరాజయాలు ఆయన జీవితంలో తరుముకుంటూ వచ్చాయి. అయినా ఎలాన్ మస్క్ ఎక్కడా వెనక్కి తగ్గలేదు. ఎక్కడికక్కడ సమస్యలను పరిష్కరించు కుంటూ జీవితంలో దూసుకువెళ్లాడు ఎలాన్ మస్క్. తన ఈడు పిల్లలతో కలిసేవాడు కాదు.ఎప్పుడూ ఒంటరిగా కూర్చునేవాడు. బాల్యంలో తోటి పిల్లలతో కలిసేవాడు కాదు. ఆకాశం వైపు చూస్తూ ఏదో ఆలోచిస్తున్నట్లు ఉండేవాడు. పరధ్యానానికి కేరాఫ్ అడ్రస్‌లా ఉండేవాడు. ఇంట్రావర్ట్‌గా ఉన్న ఎలాన్ మస్క్ మనస్సులో బాధ తొలగించుకో వడానికి వీడియో గేమ్స్‌కు అలవాటుపడ్డాడు. కొంత కాలం బాగానే సాగింది. ఆ తరువాత ఎవరో డిజైన్ చేసిన వీడియో గేమ్స్ నేను ఆడటమేమిటి? అని డిసైడ్ అయ్యాడు. తన క్రియేటివిటీతో బ్లాస్టర్ అనే ఒక సరికొత్త వీడియో గేమ్‌ను రూపొందించాడు. పెన్సిల్వేనియాలో చదువు తరువాత సోదరుడి తో కలిసి 'జిప్ 2' అనే కంపెనీ స్థాపించాడు. జిప్2 మార్కెట్‌లో మంచి పేరు తెచ్చుకుంది. 1999లో జిప్ 2 సంస్థను ప్రముఖ కంప్యూటర్ సంస్థ కాంపాక్ 307 మిలియన్ డాలర్లకు కొనుక్కొంది. కానీ అందులో కేవలం ఏడు శాతం మాత్రమే ఎలాన్ చేతికి దక్కింది.సాఫ్ట్‌వేర్ మజాను ఎలాన్‌కు రుచి చూపించింది. టెస్లా, స్పేస్ ఎక్స్, ఈ రెండు సంస్థలు ఎలాన్ మస్క్‌ను ఎక్కడికో తీసుకెళ్లాయి. టెస్లా గ్రూప్ కింద ఎలెక్ట్రిక్ కార్లు రూపొందించడానికి ఎలాన్ మస్క్ నిద్రాహారాలు లేకుండా శ్రమించాడు. టెస్లా కారును ప్రమోట్ చేయడానికి.. అడ్వర్టయిజ్ మెంట్లపైన డాలర్ కూడా ఆయన ఖర్చుపెట్టడు. మన ప్రొడక్టే మాట్లాడాలి అంటాడు టెస్లా కంపెనీ అధినేత. కార్లే కాదు? అంతరిక్షమన్నా ఆయనకు బోలెడు ఆసక్తి. తన ఆలోచనలకు అనుగుణంగా స్పేస్ ఎక్స్ సంస్థను ఆయన ప్రారంభించారు. స్పేస్ ఎక్స్‌తో అంతరిక్షంలోకి అడుగుపెట్టారు ఎలాన్ మస్క్. దీంతో ప్రపంచ వ్యాప్తంగా ఎలాన్ మస్క్ పేరు మార్మోగింది. ఆయనకు సెలవలంటే పడదు. ఎప్పుడూ పనిలోనే, ఆనందం వెతుక్కునే వ్యక్తి మస్క్ మహాశయు డు. నిద్ర కూడా తక్కువే. ఒక్కసారి అలా సీట్లో కూర్చోగానే పని రాక్షసుడైపోతాడు. ఏదిఏమైనా ఎలాన్ మస్క్ ఒక వివాదాస్పద కార్పరేట్ దిగ్గజం. పరాజయాలనే పునాదిగా చేసుకుని జీవితంలో అనేక విజయాలు సాధించిన సక్సెస్ స్టోరీ ఎలాన్ మస్క్‌ది.

## సిక్కోలు రాజకీయాల్లో సెల్ఫీ హీట్

శ్రీకాకుళం, ఏప్రిల్ 24, (న్యూస్ పల్స్) సోషల్ మీడియా వేదికగా చేసుకుని టీడీపీ, వైసీపీ నేతలు సెల్ఫీలతో సవాల్ విసురుకుంటు కొత్త ఒరవడికి నాంది పలుకుతున్నారు. మాటకు మాటతో సవాళ్లు విసురుకుంటూ కొత్త తరహా వివాదానికి దారి తీస్తున్నారు. ఈ జాబితాలో సీదిరి అప్పలరాజు, గౌతు శిరీష చేరిపోయారు. రాష్ట్రపశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పల రాజు, పలాస టీడీపీ ఇన్చార్జ్ గౌతు శిరీషల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి ఉంది. పలాసలో శిరీష తన శక్తికి మించి మంత్రి సీదిరితో పోరాతున్నారు. ఈసారి కొత్త ఒరవడి సృష్టిస్తూ ఇద్దరూ సెల్ఫీ ఛాలెంజ్‌లు విసురుకుంటున్నారు. ఇప్పటి వరకు మాటల వార్ సాగగా తాజాగా సెల్ఫీ వార్ వైపు అడుగులు వేసింది. పలాస కాశీబుగ్గలో కిడ్నీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం పూర్తి అవుతుంది. త్వరలో వైద్య సేవలందిస్తామని చెబుతూ ఆ భవనం ముందు మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు నిల్చొని, ముఖ్యమంత్రి మాస్క్ ధరించి కుర్చీపై కుర్చొని గురువారం సెల్ఫీ దిగారు. సోషల్ మీడియాలో దీన్ని పోస్టు చేయగానే పెద్ద ఎత్తున వైరల్ అయింది. పలాస నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జీ గౌతు శిరిష పలాస పట్టణానికి ఆనుకుని హుద్‌హుద్ ఇళ్లు చూపుతూ ఆమె సెల్ఫీ దిగారు. దీన్ని సోషల్ మీడియాలో పెట్టి సీదిరికి కౌంటర్ ఇచ్చారు. ఉద్దానం ప్రాంతంలో ఎవరి హయాంలో ఏమి అభివృద్ధి సాగిందో చర్చించుకుందామంటూ ఛాలెంజ్ విసిరారు. రంగులు వేసే భవనం ముందు సెల్ఫీ తీయడం కాదని, ఎన్నికలు వచ్చేలోగా ఆసుపత్రిని ప్రారంభించగలరా? అని శిరీష ఛాలెంజ్ విసిరారు. గతంలో పలాసలో ఎమ్మెల్యేగా ఉన్న గౌతు శివాజీ ఆధ్వర్యంలో నిర్మించిన 2090 టిడ్కో భవనాలు ముందు నిల్చుని ఛాలెంజ్ విసిరారు. పలాసలో సంవత్సరాలు దాటిన కేటీ రోడ్డు విస్తరణ పనులే పూర్తి చేయ లేదని గుర్తు చేశారు. నెమలి కొండపై, బెండికొండ వద్ద హుద్‌హుద్ ఇళ్లు ఎప్పుడు నిర్మించారో స్థానిక ప్రజలకు తెలుసని గుర్తు చేశారు. శ్రీకాకుళం మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి తమ ప్రభుత్వ హయాంలో సింగుపురం వద్ద ప్రారంభించిన నర్సింగ్ కళాశాల వద్ద ఫొటో తీసుకుని సోషల్ మీడియాలో పోస్టు చేశారు. నరసన్నపేటలో తమ ప్రభుత్వ హయాంలో రోడ్డు పనులు పూర్తి చేశామని సెల్ఫీలో అధికార పార్టీ నేతలు దిగారు. మరో చోట శిలాఫలాకాన్ని చూపుతు సెల్ఫీ తీసుకున్నారు. ఇలా అధికార, ప్రతిపక్ష నేతల మధ్య సెల్ఫీల యుద్ధం సాగుతోంది. జిల్లాలో శ్రీకాకుళం-ఆమదాలవలస రోడ్డుపై ఇరుపక్ష నేతలు కలిసి తిరిగితే ప్రజలు ఎవరెవరిని ఏమంటున్నారో తెలుస్తుందని పలువురు సూచిస్తున్నారు. నాగావళి, వంశధార నది తీర ప్రాంతంలో కరకట్టల నిర్మాణం చేపడతామని పాలకులు ఇచ్చిన హామీలు వరదలో కొట్టుకుపోయాయి. ఈ తీరప్రాంతాల్లోకి వెళ్లి సెల్ఫీ తీసుకుంటే అభివృద్ధి ఏమిటనేది కనిపిస్తుందని ప్రజలు వ్యాఖ్యానిస్తున్నారు. సముద్ర తీర ప్రాంతాలకు వెళ్లి మత్యకారులతో కదిలించి సెల్ఫీ తీసుకోవాలని, ఉద్దానం ప్రాంతానికి వెళ్లి కిడ్నీ బాధితుల బాధలో పాలుపంచుకుని సెల్ఫీ తీసుకోవాలని, సమస్యలు పరిష్కారం కాక ఇబ్బందులు పడుతున్న నిర్వాసితుల వద్దకు వెళ్లి సెల్ఫీ తీసుకుంటే వారి కష్టాలు తెలుస్తాయని ఒక్కొక్కరూ ఒక్కోలా స్పందిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులు వెచ్చించిన నిధులు సకాలంలో ఖర్చు చేసి లక్ష్యాలను పూర్తి చేసుకోలేని రాజకీయ పార్టీ నేతలు సెల్ఫీలకు దిగితే వారి పరువే పోతుందని రాజకీయ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై వారు తిరుగుబాటు చేసి సెల్ఫీలకు దిగితే ఎవరైన అడ్డుకోగలరా అని ప్రశ్నిస్తున్నారు.

## రైతుల కష్టాలు తీరేదెన్నడు

ఏలూరు, ఏప్రిల్ 24, ఏపీలో జగన్ సర్కార్ మాటలకూ చేతలకూ పొంతన ఉండటం లేదు. రైతు పక్షపాతినని చెప్పుకుంటున్న జగన్ ఆచరణలో మాత్రం వారిపై శీత కన్నేశారు. మద్దతు ధర ఇచ్చి మరీ దాన్యం కొనుగోలు చేస్తానని ఆయన ఇచ్చిన హామీ 'ఫ్యాన్' గాలికి కొట్టుకుపోయింది. తెగుళ్లు, అధిక వర్షాలు, దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపాయి. అసలే దిగుబడి తగ్గి దిగాలుగా ఉన్న రైతుకు ప్రభుత్వం మాట తప్పి మడమ తిప్పడంతో మరోవైపు మద్దతు ధర లభించే పరిస్థితి కానరావడం లేదు. వర్షం.. తెగుళ్లు.. ధాన్యం రైతును దారుణంగా దెబ్బతీశాయి. ఆరుగాలం కష్టించి సాగు చేసినా ఆశించిన దిగుబడులు రాక అన్నదాత అల్లాడుతున్నాడు. సాగు కష్టాలను అధిగమించి పండించిన ధాన్యానికి మార్కెట్‌లో మద్దతు గిట్టుబాటు ధర లేక మరింత కుదేలౌతున్నాడు. ప్రభుత్వం పేరుకే మద్దతు ధర ప్రకటించింది. కానీ కొనుగోలు విషయంలో మాత్రం చేతులెత్తేసింది.ఆర్‌బీకేల్లో నిబంధనలు పరిశీలిస్తే ధాన్యం విక్రయించుకునే పరిస్థితి లేదని రైతులు చెబుతున్నారు. యంత్రాలతో నూర్పిళ్లు చేస్తున్నందున తేమ ఉంటుందన్నారు. అయితే 17 శాతం లోపే తేమ ఉండాలని మార్కెటింగ్ శాఖ షరతులు విధిస్తున్నది. దీనికి తోడు ట్రాన్స్‌ఫోర్టు ఖర్చులు, కాటా కూలి కలిపితే బస్తాకు వందకుపైగా ఖర్చు అవుతోందని రైతులు చెబుతున్నారు. ఆర్‌బీకేలలో షరతులు సడలించాలని, తేమను పరిగణనలోకి తీసుకోకుండా కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. బహిరంగ మార్కెట్‌లో కూడా మద్దతు ధర అమలయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందీ లేకుండా ధాన్యం కొనుగోళ్లు జరుపుతామని చెప్పిన జగన్ సర్కార్ ఇప్పుడు వారిని ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. మార్కెట్‌లో ధాన్యం ధర నానాటికీ తీసికట్టు అన్నట్లుగా పతనమౌతోంది. మరో వైపు జగన్ సర్కార్ రైతుల కష్టాలు పట్టనట్లు వ్యవహరిస్తున్నది. దిగుబడులు తగ్గి, ధర పతనమై రైతులు తీవ్రంగా నష్టపోతు న్నారు. ఆర్‌బీకేల ద్వారా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తామని ప్రభుత్వం కేవలం ప్రకటనలు చేసి చేతులుదులిపేసుకుంది. క్షేత్రస్థాయిలో కొనుగోలుకు ప్రభుత్వం ఎటువంటి చర్యలూ తీసుకోలేదు. ఇప్పటికీ కొనుగోళ్లు ప్రారంభం కాకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో రైతులు ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. దీనిని అలుసుగా తీసుకుని వ్యాపారులు ధరను అమాంతం తగ్గించేసి రైతులను నిలువునా దోచుకుంటున్నారు. ఒక్క సాగర్ ఆయకట్టులోనే రెండున్నర లక్షలకు పైగా ఎకరాలలో వరి సాగు జరిగింది. ఎకరాకు 25 బస్తాలలోపే దిగుబడులు ఉంటున్నాయని రైతులు తెలిపారు. ప్రభుత్వం ఆర్కేబీలలో ధాన్యం కొనుగోళ్ల నిబంధనలు సడలించి మద్దతు ధరకుప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేయాలన్న రైతుల డిమాండ్ ను సర్కార్ పెడచెవిన పెడుతోంది. ప్రకటనలకే రైతు భరోసా కానీ వాస్తవంలో జరుగుతున్నది రైతును దోపిడీ చేయడమేనని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## గన్నవరం సీట్ కాస్ట్లీ గురూ...!

విజయవాడ, ఏప్రిల్ 24, గన్నవరం టిక్కెట్ కోసం రూ.150 కోట్లు ఖర్చు పెడతామంటూ ఒక వ్యక్తి తనను సంప్రదించారంటూ తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత చింతమనేని ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. గన్నవరం సీట్ కోసం అంత ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి ఉందా అనే అంశంపై ఇప్పుడు సర్వత్రా చర్చ మెదలైంది.గన్నవరం సీట్ చాలా కాస్ట్ లీగా మారిందా... సింగిల్ హ్యాండ్ తో 150కోట్ల రూపాయలు ఖర్చు పెట్టేందుకు కూడా వెనకాడటం లేదని ప్రతిపక్ష పార్టీ చెబుతుంటే, అధికార పక్షం మాటేంటి.. ఇలాంటి పరిస్థితులు నిజంగా ఉన్నాయా... అసెంబ్లి సీట్ లో ఎమ్మెల్యేగా గెలవాలంటే అన్ని కోట్లు ఖర్చు చేయాల్సిందేనా.. ఒకవేళ ఓడిపోతే పరిస్థితి ఏంటని సందేహాలు ఇప్పుడు ఎక్కడ చూసినా చర్చ నీయాశంగా మారాయి. మాజీ సీఎం చంద్రబాబు నాయుడు జన్మదినాన్ని పురస్కరించుకొని గన్నవరంలో నిర్వహించిన కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ నేత, మాజీ శాసనసభ్యుడు చింతమనేని ప్రభాకర్ హాజరయ్యారు. ఈ సందర్బంగా ఆయన చేసిన వ్యాఖ్యలు హాట్ టాపిక్గా మారాయి. తెలుగుదేశం పార్టీ తరఫున గన్నవరం సీట్ ను ఇప్పిస్తే 150కోట్లు ఖర్చు చేసేందుకు సిద్ధంగా ఉన్నానంటూ ఒ వ్యక్తి తనను సంప్రదించారని చింతమనేని ప్రభాకర్ తెలిపారు. అయితే అందుకు తాను అంగీకరించలేదన్నారు. దమ్మున్న నాయకుడు కావాలి కాని, కోట్లు ఖర్చు చేసేవాడు అవసరం లేదని చెప్పానని తెలిపారు. మరోవైపున అంత డబ్బు ఇస్తానన్న వ్యక్తి పేరు మాత్రం తాను చెప్పనని చింతమనేని అన్నారు. ఇప్పుడు ఈ వ్యాఖ్యలు పొలిటికల్ సర్కిల్ లో అగ్గి రాజేశాయి. తెలగు దేశం పార్టీ గన్నవరం సీటుకు 150కోట్లు ఆఫర్ చేస్తే, ఇక అదికార పార్టికి చెందిన సీట్ కోసం అయితే ఎంత డిమాండ్ ఉంటుందో అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. నిజంగా సీటు కోసం అంత డిమాండ్ ఉంటే, ఖర్చు చేసిన నాయకుడు ఓటమి పాలయితే అతన్ని ఎవరు ఆదుకుంటారని అధికార, విపక్షాలలో చర్చ మొదలైంది.చింతమనేని ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలపై గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ స్పందించారు. చింతమనేని వ్యాఖ్యలపై స్పందించిన గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ.. చింతమనేని తన ఊరిలో తన పని చేసుకోవాలని సూచించారు. మంగమ్మ శపథాలు చేయటం మానుకోవాలన్నారు. 23 మంది ఎమ్మెల్యేలు గెలిచి, నలుగురు విభేదించిన టీడీపీ వెంటిలేటర్ మీద ఉందా లేక 151 మంది గెలిచిన పార్టీ వెంటిలేటర్ పైన ఉందో చెప్పాలన్నారు. పోయే కాలం వచ్చిన వాళ్లు .. వాళ్లు పోయారు వీళ్లు పోయారంటూ అరుస్తుంటారని వంశీ ఎద్దేవా చేశారు. 74 ఏళ్లు వచ్చిన చంద్రబాబుకు

పరిణతి రాలేదని, ఇంకా ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని అన్నారు. గన్నవరంలో చంద్రబాబు గానీ లోకేష్ గానీ పోటీ చేయాలని నేను చాలా సార్లు డైరక్ట్ గా చెప్పానని సవాల్ చేశారు. ఎక్కడ నుండో ఇక్కడకు వచ్చి ఇష్టానుసారంగా మాట్లాడటం సమంజనం కాదని చెప్పారు.ఉమ్మడి క్రిష్ణా జిల్లాలోని గన్నవరం, గుడివాడ నియోజకవర్గాలపై తెలుగుదేశం నేతలు పూర్తిగా ఫోకస్ పెట్టారు. ఇప్పటికే ఈ రెండు స్థానాలను కైవసం చేసుకునేందుకు అవసరం అయిన అన్ని మార్గాలను తెలుగు దేశం అన్వేషిస్తోంది. పార్టీకి పూర్తిగా కట్టుబడి ఉండే అభ్యర్దులు, రాజకీయంగా వచ్చే సవాళ్ళను ఎదుర్కొనే వారిని ఎంపిక చేసేందుకు ఆ పార్టీ నాయకత్వం అన్ని ప్రయత్నాలు చేస్తోంది. గన్నవరంలో సిట్టింగ్ శాసన సభ్యుడు వల్లభనేని వంశీ, గుడివాడ శాసనసభ్యుడిగా ఉన్న మాజీ మంత్రి కొడాలి నానిని ఎట్టి పరిస్థితుల్లో మళ్లీ గెలవనీయకూడదనే ఉద్దేశంతోనే తెలుగు దేశం నేతలు ప్రయత్నాలు సాగిస్తున్నారు.

## ముందుకు సాగని రైతు భరోసా కేంద్రాలు

విజయవాడ, ఏప్రిల్ 24, రాష్ట్రంలో గ్రామ సచివాలయ, రైతు భరోసా కేంద్రాలు (ఆర్‌బికె), వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణ పనులు నిలిచి పోయాయి. వైసిపి అధికారంలోకి రాగానే సచివాలయ, ఆర్‌బికె, హెల్త్ సెంటర్లు, డిజిటల్ లైబ్రరీలతోపాటు బల్క్‌మిల్క్ కూలింగ్ యూనిట్స్ (బిఎంసియు) 44,119ని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. వాటిలో ఇప్పటి వరకు 28,989 భవన నిర్మాణాలు ప్రారంభమవ్వగా, 15,130 భవనాలకు పునాదే పడలేదు. ఇప్పటి వరకు 7,809 భవన నిర్మాణాలే పూర్తవ్వగా, ఇందుకోసం రూ.3,154.47 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేసింది. బేస్‌మెంట్, రూఫ్ లెవల్, రెండో స్లాబ్, చివరి దశలో ఉన్నవాటికి ఇంకా బిల్లులు చెల్లించలేదు. ఉపాధి హామీ పథకం ద్వారా విడుదలయ్యే మెటీరియల్ నిధులను ఖర్చు చేయాలని పంచాయతీరాజ్‌శాఖను ప్రభుత్వం ఆదేశించింది. అయితే మెటీరియల్ నిధులు విడు దల చేయడంలో కేంద్ర ప్రభుత్వం తాత్సారం చేస్తుండటంతో భవన నిర్మాణాలన్నీ అసంపూర్తిగా మిగిలిపోయాయి. రాష్ట్రంలో సుమారు 10,898 గ్రామ సచివాలయాలు, మరో 10,328 ఆర్‌బికెలు, 8,509 వైఎస్‌ఆర్ హెల్త్ సెంటర్లు, 4,485 డిజిటల్ లైబ్రరీలు, 9,899 బిఎంసియులన్నీ కలిపి 44,119 భవనాలను రూ.10,668.50 కోట్లతో నిర్మించాలని ప్రభుత్వం భావించింది. 13 జిల్లాల్లో 676 మండలాలుండగా, ఒక్కో మండలంలో ఐదారు భవనాలు మినహా మిగిలినవన్నీ అసంపూర్తిగానే ఉన్నట్లు పంచాయతీరాజ్ ఇంజినీరింగు విభాగం అధికారులు చెబుతున్నారు. చేసిన పనులకు బిల్లులు మంజూరు కావడంలో తీవ్ర జాప్యం జరుగుతుండటంతో, కాంట్రాక్టర్లు నిర్మాణ పనులు నిలిపివేశారు. పలుకుబడి ఉన్న అధికార పార్టీ నాయకులకు మాత్రం అరకొరా బిల్లులు మంజూరవుతున్నాయి. రాష్ట్రంలో 2021-22 ఆర్థిక సంవత్సరంలో రూ.7,800 కోట్ల విలువైన ఉపాధి పనులు జరిగాయి. మట్టి పనుల విలువ ఆధారంగా కేంద్రం నుంచి రాష్ట్రానికి రూ.3,284.66 కోట్ల మెటీరియల్ నిధులే మంజూరవుతాయి. మెటీరియల్ నిధులను విడుదల చేయడంలో కేంద్రం తీవ్ర తాత్సారం చేస్తుండటం భవన నిర్మాణాలపై తీవ్ర ప్రభావం చూపిస్తోంది. మూడు విడతల్లో రూ.1,900 కోట్ల మెటీరియల్ నిధులు విడుదలవ్వగా, ఇంకా రూ.780 కోట్లపైనే నిధులు రావాల్సి ఉంది. అవి వచ్చినా పెండింగు బిల్లులు చెల్లించేందుకు చాలవని పంచాయతీరాజ్ ఇంజినీర్ల సంఘం ప్రతినిధి ఒకరు తెలిపారు.

## చెలరేగిపోతున్న మట్టి మాఫియా



విజయవాడ, ఏప్రిల్ 24,గుడివాడలో అధికార పార్టీకి చెందిన మట్టి మాఫియా చెలరేగిపోతోంది. మండలంలోని మోటూరు గ్రామంలో జరుగుతున్న అక్రమ తవ్వకాలను అడ్డుకున్న రెవెన్యూ అధికారులపై మైనింగ్ మాఫియా దాడికి దిగింది. గుడివాడ మండలం మోటూరు గ్రామంలో గత కొన్ని రోజులుగా రాత్రిళ్ళు జరుగుతున్న మట్టి తవ్వకాలపై రెవెన్యూ అధికారులు దాడులు నిర్వహించడంతో తవ్వకాలను అడ్డుకున్న ఆర్ఐ అరవింద్‌పై దాడికి దిగారు.మోటూరు గ్రామంలోని కాలువల వెంట మట్టి తవ్వకాలు జరుగుతుండగా తన సిబ్బందితో కలిసి ఆర్ఐ అరవింద్ అడ్డుకోవడంతో ఎదురుతిరిగిన వైసీపీకి చెందిన మట్టి మాఫియా ఆయనపై దాడికి దిగడంతో రెవెన్యూ యంత్రాంగం నిర్ఘాంతపోయింది. గ్రామంలో జరుగుతున్న అక్రమ తవ్వకాలపై గతంలోనే దాడులు నిర్వహించి అక్రమ తవ్వకాలను నిలుపుదల చేసినట్లు అర్ఐ అరవింద్ తెలియజేశారు. గుడివాడ మండలంలో ఇసుక మాఫియా వీరంగం సృష్టించింది. ఏకంగా ఆర్ఐ మీదే దాడికి యత్నించింది. సకాలంలో పోలీసులు రంగ ప్రవేశం చేయడంతో ఆర్ఐ ప్రాణాలతో బైటపడ్డారు. వైకాపా దన్నుతోనే ఇసుక మాఫియా రెచ్చిపోతున్నదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పైగా గుడివాడ అంటే అక్కడ వైకాపా మాజీ మంత్రి కొడాలి నానిదే హవా!కృష్ణా జిల్లా గుడివాడ మండలం మోటూరు గ్రామ పరిధిలోని అక్రమ ఇసుక మాఫియా రాత్రివేళలలో కాల్వల వెంట అక్రమంగా ఇసుకను తరలించేందుకు ప్రయత్నిస్తున్నారన్న సమాచారం మేరకు ఆర్ఐ అరవింద్ అక్కడకు ఇద్దరు సిబ్బందిలో వెళ్లారు. అక్రమ ఇసుక తరలింపును, తవ్వకాలను అడ్డుకునేందుకు ప్రయత్నించారు. దీంతో మాఫియాదారులు ఆర్ఐను అడ్డుకోవటమే కాకుండా దాడికి దిగారు. ఏకంగా జేసీబీతో తొక్కించే ప్రయత్నం చేశారు. జేసీబీతో పక్కకు నెట్టివేశారు. సరిగ్గా అదే సమయానికి పోలీసులు అక్కడకు చేరుకున్నారు. దీంతో మాఫీయా గ్యాంగ్ పలాయనం చిత్తగించింది. ఈ దాడిపై ఆర్ఐ అక్రమ ఇసుక తవ్వకాలను ను అడ్డుకొనేందుకు ఇద్దరు సిబ్బందితో తాను వెళ్లానని, తనపై పలువురు దాడికి దిగారని, జేసీబీపీ జేసీబీతో నెట్టివేసే ప్రయత్నం చేశారన్నారు. ఆర్ఐపై దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని రెవెన్యూ, ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఇక తెలుగుదేశం ముఖ్యమంత్రి అండతోనే ఇసుక మాఫియా రెచ్చిపోతున్నదని ఆరోపణలు చేస్తున్నారు. కొడాలి నాని ప్రత్యక్ష ప్రమేయంతోనే మాఫియా గుడివాడ మండలంలో రెచ్చిపోతున్నదన్నారు. మంత్రి పదవి పోయిన తరువాత పశువుల కొట్టంలో కాలం వెళ్లదీస్తున్నానని చెబుతున్న కొడాలి చేస్తున్నది ఇసుక అక్రమ దందాయేనని విమర్శిస్తున్నాయి. కాగా ఆర్ఐపై దాడి జరిగిన స్థలాన్ని తెలుగుదేశం నాయకులు పరిశీలించారు. వైకాపా అండతోనే, వారి దన్నుతోనే ఇసుక మాఫియా రెచ్చిపోతోందని, అధికారులపై దాడులకు సైతం వెరవడం లేదని ఆరోపించారు. ఎమ్మెల్యే కొడాలి నాని అనుచరులు గుడివాడలో పెద్ద ఎత్తున అక్రమ మైనింగ్ నిర్వహిస్తున్నారని ఆరోపించారు.అక్రమ తవ్వకాలపై ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకోలేదనీ, కొడాలి నాని, ఆయన అనుచరుల అరాచకాలకు హద్దు, అడ్డు, అదుపూ లేకుండా పోయిందనీ, ఇదేమిటని ప్రశ్నించిన వారిపై దాడులకు తెగబడుతున్నారని తెలుగుదేశం ఆరోపించింది.తమకు అందిన సమాచారం మేరకు తిరిగి ప్రారంభమైన తవ్వకాలను అడ్డుకున్న తనపై మట్టి మాఫియా దాడి చేసినట్లు పేర్కొన్నారు. ఈ విషయం తెలుసుకుని సంఘటనా స్థలానికి చేరుకున్న ఉద్యోగ సంఘాల నాయకులు , ఆర్ఐపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## మే 5 నుంచి 15 వరకు పోరాటం

రాజమండ్రి, ఏప్రిల్ 24,రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన వ్యతిరేక విధానాలపై మే 5 నుంచి 15 వరకూ పది రోజులు పాటు పోరాటం చేయాలని ఏపీ బీజేపీ నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ఛార్జ్ షీట్ లు దాఖలు చేస్తాం అన్నారు. బీజేపీ అంటే వైసీపీకి అనుకూలం అన్న వాతావరణాన్ని అధిగమిస్తాం అని చెప్పారు. ఏపీ ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై మే నెలలో 10 రోజులపాటు నిరసన, ఆందోళనతో పోరాట కార్యక్రమాలు చేపడతామన్నారు. కుటుంబ పార్టీలకి బీజేపీ వ్యతిరేకం అన్నారు. మే 15 నుంచి జూన్ 15 వరకు ప్రధాని మోదీ పాలన రాష్ట్ర అభివృద్ధిపై బీజేపీ ప్రచార భేరి నిర్వహిస్తుందన్నారు మాధవ్. తాము జనసేన తోనే ఉన్నామని, జనసేనతోనే కలిసి వెళ్తాం అన్నారు. జనసేనతో కలిసి కార్యక్రమాల రూపకల్పనకు ప్రణాళిక చేస్తున్నానీ అన్నారు. రాష్ట్రంలో అరాచక పరిపాలన జరుగుతుందని ఆరోపించారు. వ్యవస్థలు నాశనం చేసి రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిన వైఎస్ జగన్ అరాచకాలపై కోర్ కమిటీలో నిర్ణయాలు తీసుకున్నామని చెప్పారు.క్షేత్ర స్థాయిలో వాగ్దానాలు.. ప్రభుత్వ తప్పిదాలు, భూ కబ్జాలపై కోర్ కమిటీలో చర్చించారు. ఏదో అద్భుతాలు చేస్తానని చెప్పిన సీఎం జగన్ ప్రజల్ని మోసం చేసిన దానిపై రాష్ట్ర జిల్లా స్థాయిలో చార్జ్ షీట్స్ బయటకు తియ్యాలని నిర్ణయం తీసుకున్నట్లు మాధవ్ తెలిపారు. రాష్ట్రంలో భూ దందా... కబ్జాలు, ఇసుక మాఫియా సమస్యతో పాటు మద్యాన్ని నిషేధించాలని వీటిన్నిటిపై ఏపీ బీజేపీ నేతలు ఉద్యమం చెయ్యాలని నిర్ణయించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై సమర శంఖం మోగించనున్నాం. మే 5 నుండి 16 వ తేదీ వరకు రాష్ట్ర జిల్లా స్థాయిలో చార్జిసీట్ తీసుకువచ్చే కార్యక్రమాలు చేపడుతున్నారు.జనసేన నేతలకు కూడా ఈ కార్యక్రమాలు వివరించి కలిసికట్టుగా వేళతామన్నారు. వైసీపీతో బీజేపీ కలిసికట్టుగా వెళ్తుందని... అసత్య ప్రచారం జరుగుతుంది దాని తిప్పి కొడదాం అని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు మాధవ్. గతంలో తెలుగు దేశం కూడా రాష్ట్రంలో అరాచకాలు చేసిందని... కుటుంబ పాలన పార్టీలకి బీజేపీ ఎప్పుడూ వ్యతిరేకమేనని స్పష్టం చేశారు. అచ్చెన్నాయుడు, పితాని ఏదో ఊహించి మాట్లాడుతున్నారు.. కేంద్ర పెద్దలలో కూడా జనసేనాని పవన్ భేటీ అయ్యారు. జనసేన, బీజేపీ పరస్పరం గౌరవించుకుంటూ రూట్ మ్యాప్ సిద్ధం చేసుకుని ముందుకు వెళతాం అన్నారు. పవన్ మాతోనే ఉన్నారు.. ఉమ్మడి కార్యక్రమాలు నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నానీ అని బీజేపీ నేత మాధవ్ స్పష్టం చేశారు. ఏ పార్టీతో పొత్తులు ఉంటాయన్నది బీజేపీ కేంద్ర కమిటీ నిర్ణయిస్తుందన్నారు.

# కంచుకోటపై టీడీపీ గురి



విజయవాడ, ఏప్రిల్ 24,తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడుపైనా ఆయన కుటుంబంపైనా అడ్డదిడ్డంగా విరుచుకుపడటంలో ఆ ఎమ్మెల్యే ముందు వరుసలో ఉంటారు. 2019 ఎన్నికల్లో గెలిచింది తెలుగుదేశం పార్టీ తరఫునే అయినా ఆ తర్వాత పార్టీకి గుడ్ బై చెప్పేసి వైసీపీ పంచన చేరిపోయారు. వైసీపీలో అధికారికంగా చేరిపోతే ఎక్కడ బహిష్కరణకు గురవుతుందో అనే భయంతో మద్దతుగా నిలిచారు. వైసీపీకి అనుబంధంగా మారిపోయారు. అంతేకాదు రాజకీయంగా భిక్ష పెట్టిన టీడీపీపై తీవ్ర విమర్శలు చేస్తున్నారు. టీడీపీని కరుడుగట్టిన వైసీపీ నేత కూడా విమర్శలు చేయని విధంగా ఇంటా బయట తిట్లపురాణం అందుకోవడంలో ఆ ఎమ్మెల్యే రూటే సెపరేటు. అయితే వచ్చే ఎన్నికల్లో ఆ టీడీపీ రెబల్ ఎమ్మెల్యేను ఓడించాలని తెలుగుదేశం పార్టీ గట్టిగా ప్రయత్నిస్తోంది. ఇంతకీ ఆ ఎమ్మెల్యే ఎవరో అర్థమయ్యే ఉంటుంది కదూ..గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్. వల్లభనేని వంశీమోహన్ ఓటమే ధ్యేయంగా దమ్మున్న నాయకుడిని బరిలోకి దించుతామని టీడీపీ ప్రకటిస్తోంది. దీంతో గన్నవరం వేదికగా వైసీపీ, టీడీపీల మధ్య రాజకీయ పోరు నడుస్తోంది.ఉమ్మడి కృష్ణా జిల్లా గన్నవరం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీకి కంచుకోట. 2009 నుంచి ఇప్పటి వరకు వరుసగా టీడీపీ అభ్యర్థులు గెలుపొందుతున్నారు. 2014,2019 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా వల్లభనేని వంశీమోహన్ విజయం ఎగురవేశారు. 2019 ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి రావడంతో వల్లభనేని వంశీ తన మిత్రులు కొడాలి నాని, పేర్ని నానిలతో కలిసి వైసీపీ అధినేత, సీఎం వైఎస్ జగన్‌తో భేటీ అయ్యారు. అప్పటి నుంచి వైసీపీకి అనుబంధంగా వ్యవహరిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ తరఫున వల్లభనేని వంశీ మోహన్ పోటీ చేయడం దాదాపు ఖరారైపోయింది. ఇక టీడీపీ అభ్యర్థి ఎవరనేదానిపై పార్టీ అధిష్టానం మల్లగుల్లాలు పడుతుంది. ఈ అసెంబ్లీ నియోజకవర్గానికి ఇన్‌చార్జిగా బచ్చుల అర్జునుడును నియమించింది. అయితే అనారోగ్యం కారణాలతో బచ్చుల అర్జునుడు మృతి చెందారు. దీంతో ఈ నియోజకవర్గం నుంచి వచ్చే ఎన్నికల్లో ఎవరిని బరిలోకి దించాలనే అంశంపై టీడీపీ అధిష్టానం అన్వేషణ ప్రారంభించింది.వల్లభనేని వంశీ అన్ని వర్గాలకు దగ్గరయ్యారు. ఆర్థికంగానూ స్థితిమంతుడు. మందిబలం కూడా ఉన్నోడు కావడంతో వైసీపీ నాయకత్వం వచ్చే ఎన్నికల్లో వంశీని బరిలోకి దించాలని నిర్ణయించింది. వైసీపీ తరఫున ఈ నియోజకవర్గం నుంచి టికెట్ ఆశిస్తున్న వారిలో దుట్టా రామచంద్రరావు, యార్లగడ్డ వెంకట్రావులు ఉన్నారు. దీంతో ఈ నేతలు ఇప్పటికే వంశీకి సహాయనిరాకరణ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వంశీ బలహీనతలు, వైసీపీపై ప్రభుత్వ వ్యతిరేకతను క్యాష్ చేసుకోవడంతోపాటు ఎలాంటి అభ్యర్థిని బరిలోకి దించాలనే దానిపై చంద్రబాబు నాయుడు మల్లగుల్లాలు పడుతున్నారు. వంశీకి వైసీపీ నాయకత్వం మద్దతు ప్రకటించడంతో ఆ పార్టీలో ఏర్పడిన విభేదాలు కలిసి వస్తాయని టీడీపీ భావిస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో బలమైన అభ్యర్థి కోసం టీడీపీ అన్వేషణ ప్రారంభించినట్లు తెలుస్తోంది. అయితే పారిశ్రామికవేత్త పుట్టగుంట సతీష్, గద్దే రామ్మోహన్, గద్దే అనురాధ, టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ పేర్లను టీడీపీ అధిష్టానం పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు గన్నవరం టీడీపీలో మాజీ ఎమ్మెల్యే దాసరి బాలవర్ధనరావు పేర్లతో ఫ్లెక్సీలు వెలిశాయి. దీంతో దాసరి బాలవర్ధనరావు పార్టీలోకి వస్తే గట్టి పోటీ ఇవ్వడంతోపాటు వైసీపీలోని విభేదాలు పార్టీకి కలిసివస్తాయనే ప్రచారం జరుగుతుంది.ఇదిలా ఉంటే గన్నవరం టీడీపీ అభ్యర్థి క్వాలిఫికేషన్స్‌పై మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. గన్నవరంలో రూ.150 కోట్లు ఖర్చు పెడతానని ఓ వ్యక్తి తన వద్దకు వచ్చినట్టు వెల్లడించారు. అయితే ఆ వ్యక్తి పేరును మాత్రం చింతమనేని ప్రభాకర్ ప్రకటించలేదు. వచ్చేఎన్నికల్లో డబ్బున్నోడిని కాదు , దమ్మునోడిని నిలబెట్టాలని నిర్ణయించినట్లు చింతమనేని ప్రభాకర్ వెల్లడించారు. తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకల్లో పాల్గొన్న చింతమనేని ప్రభాకర్ ఈ వ్యాఖ్యలు చేశారు. పార్టీలో ఉన్నవారు వెళ్తారని.. కొత్తవారు వస్తుంటారని.. అయితే మీరు మీసం మేలేసేలా పార్టీ నాయకత్వం చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సంచలనంగా మారింది. గన్నవరం నియోజకవర్గంపై కన్నేసిన అంతటి బడా నాయకుడు ఎవరా అన్న చర్చ అటు టీడీపీలోనూ ఇటు వైసీపీలోనూ చర్చ జరుగుతుంది.టీడీపీ సీనియర్ నేత చింతమనేని ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలకు గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్ కౌంటర్ ఇచ్చారు. 23 మంది ఎమ్మెల్యేల్లో నలుగురు మరో పార్టీలోకి వెళ్లినా టీడీపీ వెంటిలేటర్ మీద ఉందా..? లేక 150 మంది శాసనసభ్యుల బలం వున్న పార్టీ వెంటిలేటర్ పైన ఉందో చింతమనేని ప్రభాకర్ సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. చంద్రబాబును చూసి ఆ పార్టీ నాయకులంతా ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడుతున్నారని.. మంగమ్మ శపథాలు చేస్తున్నారంటూ ధ్వజమెత్తారు. గన్నవరంలో చంద్రబాబు, లోకేశ్‌లను పోటీ చేయాల్సిందిగా తాను చాలా సార్లు సవాల్ చేసినట్లు వెల్లడించారు.

## రెండు బస్సులు ఢీ

మచిలీపట్నం మచిలీపట్నం విజయవాడ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ప్రయాణికులు గాయాలతో బయటపడ్గారు. గూడూరు పోలీస్ స్టేషన్ పరిధిలో మచిలీపట్నం రోడ్డు రవాణా సంస్థకు చెందిన ఇంద్ర హైటెక్ బస్సు బెంగళూరు నుంచి మచిలీపట్నం వస్తుండగా గూడూరు దగ్గర ప్రైవేట్ వాహనం మార్నింగ్ స్టార్ బస్సు వెనుక నుండి ఢీకొట్టడంతో ఆర్టీసీ బస్సు పూర్తిగా ధ్వంసం అయింది. బస్సులో ప్రయాణం చేస్తున్న ప్రయాణికులకు చిన్న చిన్న గాయాలు కావడంతో హడావుడిన ఆసుపత్రికి తరలించారు. ప్రైవేట్ బస్సు డ్రైవర్ కి తీవ్ర గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించిన స్థానికులు

## అప్పన్న సన్నిధిలో భక్తుల ఆగచాట్లు

విశాఖపట్నం విశాఖ సింహాచలం చందనోత్సవం అప్పన్నస్వామి భక్తుల దర్శనంలో లోటుపాట్లు అధికారుల తీరుకు అద్దం పడుతున్నాయి.ఈ సారి టైమ్ స్లాటు విదానాన్ని ప్రవేశపెట్టినా భక్తులకు సరైన రీతిలో దర్శనం కల్పించలేని అధికారుల అలసత్వాన్ని టిడిపి మాజీ ఎమ్మెల్యే అనిత ఎండగట్టారు.క్యూలైన్ లో వేచి ఉన్న భక్తుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు.విశాఖ జిల్లా సింహాచలం సింహాద్రి అప్పన్న చందనోత్సవంలో భక్తుల అవస్థలు వర్ణనాతీతం. అధికారుల ఏర్పాట్లు చేయడంలో అట్టర్ ప్లాప్ అయ్యారని భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 1500 వి వి ఐ పి టికెట్లను నియంత్రించకపోవడం దీనికి ప్రధాన కారణమని భక్తులు మండిపడుతున్నారు.భక్తులకు ఎటువంటి కనీస సౌకర్యాలు కల్పించకపోవడంపై భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.భక్తులకు ఎటువంటి సౌకర్యాలు లేకపోగా దేవస్థానం అధికారులు, పోలీసుల ఇష్టా రాజ్యంగా ఐపోయిందని అన్నారు.

## అత్యద్భుతంగా అప్పన్న చందనోత్సవం

విశాఖపట్నం విశాఖ జిల్లాలోని సింహాచలం అప్పన్నచందనోత్సవాన్ని అత్యద్భుతంగా నిర్వహించామని దేవదాయ మంత్రి కొట్టు సత్యనారాయణ చెప్పారు. సుమారు రెండున్నర లక్షల మంది భక్తులు చందనోత్సవానికి తరలివచ్చా రని, గతంలో ఎన్నడూ ఇంతలా భక్తులు రాలేదన్నారు. అయినప్పటికీ అధికారయంత్రంగం మొత్తం పటిష్టత చర్య లు తీసుకొని చందనోత్సవాన్ని విజయవంతం చేశార న్నారు. చిన్న చిన్న లోటుపాట్లు సహజమేనని, వాటిని పెద్దగా పట్టించుకోనవసరం లేదన్నారు.

## మా నమ్మకం నువ్వే జగన్ ద్వారా ప్రజల్లోకి వైకాపా

నర్సపురం నర్సాపురం ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాద్ రాజు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ద్వారా ప్రజల మనోభావాలను అభిప్రాయాలను తెలుసుకోవడం జరిగిందని. వారి సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు కార్యచరణ రూపొందించడం జరిగిందని. రాష్ట్రవ్యాప్తంగా కోటి కుటుంబాలను ఈ కార్యక్రమం ద్వారా నేరుగా కలవడం జరిగిందని. ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో మొత్తం కోటి 65 లక్షల కుటుంబాలను సందర్శించడమే జరిగిందని. ప్రభుత్వానికి మద్దతుగా 79 లక్షలకు పైగా మిస్డ్ కాల్స్ వచ్చాయని. నర్సాపురం నియోజకవర్గంలో 70 వేల కుటుంబాలు ఉండగా గడచిన 15 రోజుల్లో 50 వేల కుటుంబాలను సందర్శించడం జరిగిందని 68% కుటుంబాలు ప్రభుత్వానికి మద్దతు తెలిపాయని .నరసాపురం నియోజకవర్గంలో ఇప్పటివరకు ప్రభుత్వానికి మద్దతుగా 28 వేల మిస్డ్ కాల్స్ వచ్చాయని జగన్ ప్రభుత్వానికి ప్రజలు మద్దతు ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నానని 175 నియోజకవర్గాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మొట్టమొదటిగా నరసాపురం నియోజకవర్గం విజయవంతంగా పూర్తి చేయడం జరిగిందని. దానిలో భాగంగా గడపగడపకు మన ప్రభుత్వం నిధులు సమకూర్చుకుని ప్రజల అభివృద్ధి పనులకు 35 శాతం పనులు పూర్తి చేయడం జరిగిందని మిగిలినవన్నీ పురోగతిలో ఉన్నాయని. రానున్న రోజుల్లో జగన్ ప్రభుత్వానికి సంపూర్ణ మద్దతు తెలియజేయాలని ప్రభుత్వ ఛీఫ్ విప్ ముదునూరు ప్రసాద్ రాజు అన్నారు.

## మండల స్థాయి ఉత్తమ పంచాయతీలకు పురస్కారం

**గిరిగెట్ల,ముక్కెళ్ల సర్పంచులకు అవార్డులు ప్రధానం**

**ఎల్లమ్మ గుట్ట తాండకు జిల్లా స్థాయి ఉత్తమ గ్రామ పంచాయతీగా పురస్కారం**

**తుగ్గలి ఎంపీడీవో మహబూబ్ బాషా**

తుగ్గలి పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ప్రతిభ కనబరిచిన మండల స్థాయి గ్రామ పంచాయతీలకు సోమవారం రోజున స్థానిక ఎంపీడీవో కార్యాలయం నందు తుగ్గలి ఎంపీడీవో మహబూబ్ బాషా అవార్డులను ప్రదానం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తుగ్గలి మండల పరిధిలోని ఎల్లమ్మ గుట్ట తండాకు జిల్లా స్థాయి ఉత్తమ పిల్లల స్నేహ పూర్వక గ్రామపంచాయతీ అవార్డు, మండల స్థాయి నందు గిరిగెట్ల గ్రామ పంచాయితీకు ఆరోగ్యకరమైన ఉత్తమ గ్రామ పంచాయతీగా,ముక్కెళ్ల గ్రామ పంచాయితీకు ఉత్తమ పరిశుభ్రమైన మరియు హరిత గ్రామ పంచాయతీగా ఎన్నికైనందున తుగ్గలి ఎంపీడీవో కార్యాలయం నందు గిరిగెట్ల,ముక్కెళ్ల గ్రామ సర్పంచులైన విజయలక్ష్మి,సుజాత లకు ఘనంగా సన్మానించి మండల స్థాయి ఉత్తమ పంచాయతీల పురస్కారాల ప్రశంసా పత్రాలను తుగ్గలి ఎంపీడీవో మహబూబ్ బాషా,ఈఓఆర్డి వీర్రాజు లు అందజేశారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ అధికారులు మరియు సర్పంచులు ఒకరికొకరు సహకారంతో గ్రామ పంచాయతీలను అభివృద్ధి చేయాలని వారు తెలియజేశారు.గ్రామాలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించి గ్రామ అభివృద్ధి కొరకు కృషి చేయాలని ఆయన తెలియజేశారు.ముందు ముందు మరిన్ని అభివృద్ధి పనులు గ్రామ పంచాయతీలలో నిర్వహిస్తూ జిల్లా మరియు రాష్ట్ర స్థాయిలో అవార్డులను గెలుచుకోవాలని ఎంపీడీవో మహబూబ్ బాషా తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఎంఈఓ రమా వెంకటేశ్వర్లు, వెలుగు ఏపిఎం రాధాకృష్ణ,సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరెడ్డి,జూనియర్ అసిస్టెంట్ రామబ్రహ్మం, ముక్కెళ్ల పంచాయతీ కార్యదర్శి కార్తీక్,సర్పంచ్ గౌరవ సలహాదారులు మధుబాబు,రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

## జేసీ ప్రభాకర్ రెడ్డి హౌస్ అరెస్టు



తాడిపత్రి ఏప్రిల్ 24 టీడీపీ సీనియర్ నేత మాజీ ఎమ్మెల్యే తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డిని పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. దీంతో ఆయన ఇంటి వద్ద ఉద్రిక్తత చోటు చేసుకుంది. జేసీ గృహనిర్బంధం నేపథ్యంలో పోలీసులు భారీ ఎత్తున మోహరించారు.తాడిపత్రి నియోజకవర్గ పరిధిలో పెద్దపప్పూరు వద్ద పెన్నా నదిలో ఇసుక మట్టి అక్రమంగా తవ్వి తరలిస్తున్నారని గతకొంతకాలంగా జేసీ ప్రభాకర్ రెడ్డి వైసీపీ నేతల పై తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇసుక మట్టి అక్రమ తవ్వకాలను అడ్డుకుంటామని ప్రకటించారు. అలాగే మట్టి ఇసుకను అక్రమంగా తరలించే వాహనాలను తగులబెడతామని జేసీ ప్రభాకర్రెడ్డి హెచ్చరించారు.ఈ నేపథ్యంలో జేసీ ప్రభాకర్ రెడ్డి ఇంటి నుంచి బయటకు రాకుండా సుమారు 100 మంది పోలీసులు ఆయన ఇంటి వద్ద మోహరించారు. ఆయనను ఇంటి నుంచి బయటకు రాకుండా ఉంచేందుకు ఇంటి చుట్టూ బారికేడ్లను ఏర్పాటు చేశారు. అంతేకాకుండా జేసీ ప్రభాకర్ రెడ్డికి సంఘీభావం తెలిపేందుకు అక్కడికి వచ్చిన 8 మంది టీడీపీ నేతలను పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం జేసీని గృహనిర్బంధం చేశారు. ఈ క్రమంలో ఇంటి నుంచి బయటకు రావడానికి ప్రయత్నించిన ఆయన్ను పోలీసులు తిరిగి ఇంట్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో జేసీ ప్రభాకర్ నేలపై పడిపోయారు.దీంతో పోలీసుల చర్యలను జేసీ తీవ్రం ఖండించారు. తన ఇంటి ముందే కుర్చీలో కూర్చొని ఆయన నిరసన తెలిపారు. దీంతో కుర్చీతో సహా జేసీని బలవంతంగా తిరిగి లోపలికి తీసుకెళ్లేందుకు పోలీసులు ప్రయత్నించారు. పోలీసుల చర్యలను టీడీపీ నేతలు అడ్డుకున్నారు. ఈ క్రమంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి.పెద్దపప్పూరు పోలీస్టేషన్ వద్ద ధర్నాకు టీడీపీ శ్రేణులకు జేసీ ప్రభాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ప్రకటనల వల్లే జేసీని అడ్డుకున్నామని పోలీసులు చెప్పారు.కాగా గతంలో తాడిపత్రి వైసీపీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి జేసీ ప్రభాకర్ రెడ్డికి మధ్య తీవ్ర మాటల యుద్ధం సాగింది. ఎమ్మెల్యే పెద్దారెడ్డి నేరుగా దాడికి జేసీ ప్రభాకర్ ఇంటికే వెళ్లడం కలకలం రేపింది. ఈ నేపథ్యంలో మరోసారి తాడిపత్రిలో హైటెన్షన్ ఏర్పడింది.2014లో తాడిపత్రి ఎమ్మెల్యేగా టీడీపీ నుంచి గెలిచిన జేసీ ప్రభాకర్ రెడ్డి 2019లో పోటీ చేయలేదు. తనకు బదులుగా తన కుమారుడు అస్మిత్ రెడ్డికి సీటు ఇప్పించారు. అయితే జేసీ అస్మిత్ రెడ్డి ఓడిపోయారు. మరోవైపు మునిసిపల్ ఎన్నికల్లో తాడిపత్రిలో టీడీపీ గెలుపొందడంతో జేసీ ప్రభాకర్ రెడ్డి మునిసిపల్ ఛైర్మన్ గా బాధ్యతలు చేపట్టారు.


## ఏప్రిల్ 30వ తేదీ లోపల గంగమ్మ గుడి మాస్టర్ ప్లాన్ రోడ్డు పూర్తి చేయాలి

**ఎమ్మెల్యే భూమన**

**నగర మేయర్ శిరీష, కమిషనర్ హరిత, అధికారులతో కలిసి పరిశీలన**

తిరుపతి సమయం లేదు మిత్రమా ఏప్రిల్ 30వ తేదీ లోపల తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ గుడి మాస్టర్ ప్లాన్ రోడ్డును శరవేగంగా పూర్తి చేసి అందుబాటులో తీసుకురావాలని అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి.తాతయ్య గుంట మాస్టర్ ప్లాన్ రోడ్డును గాంధీ విగ్రహం కూడలి నుండి తుడా ఆఫీస్ వరకు తిరుపతి నగర మేయర్ శ్రీమతి డాక్టర్ శిరీష, కమిషనర్ శ్రీమతి హరిత ఐఏఎస్, ఉప మేయర్ ముద్ర నారాయణ, అధికారులతో కలిసి సోమవారం ఉదయం పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి మాట్లాడుతూ తిరుపతి గంగ జాతర అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామని,అందులో భాగంగా గంగమ్మ గుడి మాస్టర్ ప్లాన్ రోడ్డును వివిధ డిపార్ట్మెంట్ అధికారులు సమన్వయంతో శరవేగంగా పూర్తిచేయాలని ఆదేశించారు.మేయర్ శ్రీమతి డాక్టర్ శిరీష, కమిషనర్ శ్రీమతి హరిత ఐఏఎస్ మాట్లాడుతూ తాతయ్య గుంట మాస్టర్ ప్లాన్ రోడ్డును ప్రజలకి ఇబ్బంది కలక్కుండా నాణ్యతతో శరవేగంతో అభివృద్ధి పనులు పూర్తి చేయాలని అధికారులను, గుత్తేదారులను ఆదేశించారు.మాస్టర్ ప్లాన్లు రోడ్లను పరిశీలించే వారిలో మున్సిపల్ ఇంజనీర్ చంద్రశేఖర్, డివిజన్ నాయకులు దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, అసిస్టెంట్ సిటీ ప్లానర్ బాలసుబ్రమణ్యం,డి.ఈ. దేవిక, అధికారులు పాల్గొన్నారు.

## నేడు ప్రపంచ మలేరియా దినోత్సవం




మలేరియాకు కూడా ఒక దినం ఉన్నదోచ్... మలేరియా వ్యాధి నిర్మూలన, ప్రజలలో ఈ వ్యాధి పట్ల అవగాహనా కలిపించడం ఈ దినోత్సవ ముఖ్యోద్దేశ్యం. ప్రపంచవ్యాప్తంగా, 106 దేశాల్లో 3.3 బిలియన్ ప్రజలు మలేరియా బారిన పడుతున్నారు. 2012లో, మలేరియా వలన 6,27,000 మంది మరణించారు. మరణించినవారిలో ఎక్కువగా ఆఫ్రికన్ పిల్లలు ఉన్నారు. 2007లో ప్రపంచ ఆరోగ్య సంస్థ సభ్యదేశాలన్ని కలిసి ఈ ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని ఏర్పాటుచేశాయి. ఈ దినాన్ని ప్రతిసంవత్సరం ఏప్రిల్ 25 జరుపుకుంటారు. ప్రపంచ దేశాలన్నింటిలో నైజీరియా, డెమొక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, మొజాంబిక్, బుర్కినా ఫాసో, సియర్రా లియోన్ వంటి ఐదు దేశాలు ఎక్కువగా మలేరియా వ్యాధి బారినపడ్డాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక వెల్లడించింది. తాజాగా 2015లో ప్రపంచవ్యాప్తంగా 429,000 మలేరియా మరణాలు, 212 మిలియన్ కొత్త కేసులు నమోదయ్యాయి. 2010, 2015 మధ్యకాలంలో కొత్త మలేరియా కేసుల రేటు ప్రపంచవ్యాప్తంగా 21 శాతం పడిపోవడమేకాకుండా మలేరియా మరణాల రేటు 29 శాతానికి తగ్గింది.

## వివేక కేసులో ఏం జరుగుతోంది...

కడప, ఏప్రిల్ 24, (న్యూస్ పల్స్) మాజీ ఎంపీ వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో రోజుకో మలుపు చోటుచేసుకుంటుంది. సీబీఐ విచారణలో రోజుకో ట్విస్ట్ బయటపడుతుంది. తాజాగా విచారణలో కొత్త కోణం చోటుచేసుకుంది. కోఠిలోని సీబీఐ కార్యాలయానికి సునీత భర్త రాజశేఖర్ రెడ్డి చేరుకున్నారు. ఇప్పటికే ఈ కేసులో అరెస్ట్ అయిన భాస్కర్ రెడ్డి, ఉదయ్ కుమార్ రెడ్డిల విచారణ ముగిసిన తర్వాత సీబీఐ అధికారులతో రాజశేఖర్ రెడ్డి భేటీ అయ్యారు. వివేకా కేసులో పరిణామాలు వేగంగా మారుతున్న నేపథ్యంలో సునీత భర్త రాజశేఖర్ రెడ్డిని సీబీఐ అధికారులు ప్రశ్నించడం ప్రాధాన్యతను సంతరించుకుందివివేక రెండో భార్య షమీమ్ సీబీఐ అధికారులకు ఇచ్చిన స్టేట్మెంట్ ఇటీవల వెలుగులోకి వచ్చింది. ఈ స్టేట్‌మెంట్ ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. రాజశేఖర్ రెడ్డి, అతని సోదరుడిపై షమీమ్ తీవ్ర ఆరోపణలు చేసింది. అనేకసార్లు తనను హెచ్చరించి బెదిరింపులకు దిగారని సీబీఐకు ఇచ్చిన స్టేట్‌మెంట్‌లో పేర్కొంది. ఇలాంటి క్రమంలో రాజశేఖర్ రెడ్డిని సీబీఐ అధికారులు విచారించడం హాట్‌టాపిక్‌గా మారింది. రెండు గంటల పాటు రాజశేఖర్ రెడ్డి సీబీఐ ఆఫీసులో ఉన్నారు. సునీత భర్త రాజశేఖర్ రెడ్డిపై కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి మొదటి నుండి ఆరోపణలు చేస్తున్నారు. దీంతో హత్య జరిగిన రోజు రాజశేఖర్ రెడ్డి ఎక్కడ ఉన్నాడు? ఇతని ఆర్థిక, రాజకీయ వ్యవహారాలతో కూడిన 161 స్టేట్మెంట్ సీబీఐ అధికారులు రికార్డ్ చేసినట్లు తెలుస్తోంది. అన్ని అంశాలపై రాజశేఖర్ రెడ్డిని సీబీఐ ప్రశ్నించిందిసీబీఐ అధికారులకు పలు కీలక విషయాలను రాజశేఖర్ రెడ్డి వెల్లడించినట్లు చెబుతున్నారు. రాజశేఖర్ రెడ్డి, సునీతపై వైఎస్ అవినాష్ రెడ్డి అనేక ఆరోపణలు చేస్తున్నారు. రాజశేఖర్ రెడ్డి పాత్రపై సీబీఐ అధికారులు విచారణ చేపట్టడం లేదని ఆరోపిస్తున్నారు. ఇలాంటి నేపథ్యంలో రాజశేఖర్ రెడ్డిని సీబీఐ అధికారులు ప్రశ్నించడం చర్చనీయాంశంగా మారింది. ఈ నెల 30తో ఈ కేసు విచారణ పూర్తి చేయాలని సీబీఐకు సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఈ కేసు విచారణను సీబీఐ అధికారుల బృందం వేగవంతం చేసింది. ఇటీవల అవినాష్ రెడ్డి తండ్రి భాస్కర్ రెడ్డి, అవినాష్ పీఏ కార్తీక్ రెడ్డిని సీబీఐ అరెస్ట్ చేసింది. ప్రస్తుతం వారిద్దరిని సీబీఐ కస్టడీలోకి తీసుకుని గత రెండు రోజులుగా ప్రశ్నిస్తోంది. వైఎస్ అవినాష్ రెడ్డికి ముందస్తు బెయిల్ మంజూరు చేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీం స్టే విధించింది. దీంతో ఈ కేసులో ఏం జరుగుతుందనేది హాట్‌టాపిక్‌గా మారింది.

## రాములమ్మ క్లాస్ తో మారేనా



హైదరాబాద్, ఏప్రిల్ 24, తెలంగాణ రాజకీయాలు మరోసారి వేడెక్కాయి.. ఈసారి కాంగ్రెస్ పార్టీ వర్సెస్ కమలం పార్టీగా మారాయి. ఇన్నాళ్లు బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కలిసి బీఆర్ఎస్ పార్టీ మీద విమర్శలు గుప్పించాయి. కానీ తెలంగాణ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడ రేవంత్ రెడ్డి మీద ఈటల రాజేందర్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. ఈ నేపథ్యంలో రేవంత్ రెడ్డి, ఈటల రాజేందర్ లను ఉద్దేశిస్తూ బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు విజయశాంతి పలు సూచనలు చేశారు. నిరంతరం తెలంగాణ ఉద్యమకారిణిగా ప్రజల అభిప్రాయం చెప్పడం ఈ సందర్భంలో తన బాధ్యత అన్నారు. బీఆర్ఎస్ తో పోరాడే తమ్ముళ్లు రేవంత్, ఈటల తమ విమర్శల దాడిని ఒకరిపైమరొకరు చేసుకోవడం సరికాదన్నారుఈ విధానాన్ని అధికారపార్టీ ప్రజాస్వామ్య హనన రాజకీయ దుష్కృత్య ధోరణులపై కాక,ప్రతిపక్షాల నేతలు పరస్పరం చేసుకునే మాటల,సవాళ్ల దాడులు, బీఆరెస్‌కు వేడుకలవుతున్నాయి. బీఆరెస్‌తో పోరాడే తమ్ముళ్లు రేవంత్ గారు,ఈటలగారు తమ దాడిని ఒకరిపై ఒకరు కాకండా ఎవరి ధోరణిలో వారు ప్రభుత్వంపై పోరాడటం అవసరమేమోరేవంత్ రెడ్డి, ఈటల రాజేందర్ ఎవరి ధోరణిలో వారు ప్రభుత్వంపై పోరాడటం అవసరమేమో అనిపిస్తుందని ఆమె చెప్పారు. ఈ సందర్భంగా కొంచెం ఆలోచించాలని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు విజయశాంతి అన్నారు. తెలంగాణ ప్రస్తుత పరిస్థితులపై సంపూర్ణ అవగాహన ఉన్న ఇద్దరికీ చెప్పడం తన బాధ్యత అన్నారు. దేశంలోనే అత్యంత ధన ప్రభావిత ఎన్నికల కార్యాచరణ తెలంగాణలో కొనసాగుతోందని విజయశాంతి పేర్కొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి మరొకరికి గాయాలు



నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 24 విభారె న్యూస్ :- నంద్యాల జిల్లాలో సోమవారం ఉదయం జరిగిన ఒక రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మరణించగా మరో వ్యక్తి గాయపడినట్లు స్థానికులు తెలిపారు. నంద్యాల మహానంది రహదారిలో బొల్లవరం సుగాలిమెట్ట మద్దెన ఈ సంఘటన చోటుచేసుకుంది. మహానంది మండలం బొల్లవరం గ్రామానికి చెందిన జగడం సురేష్ తమ్మడపల్లె గ్రామానికి చెందిన డక్క ముని అనే ఇద్దరు మోటార్ సైకిల్ పై నంద్యాల వైపు పోవుచుండగా నంద్యాల వైపు నుండి వస్తున్న ఒక వాహనం ఢీకొట్టడంతో జగడం సురేష్ మృతి చెందాడని గాయపడ్డ ముని చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. .

# పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే శిల్పా



నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 24 విభారె న్యూస్ :-నంద్యాల పట్టణంలో సోమవారం నాడు ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. 13.50 లక్షలతో నూతన సీసీ రోడ్ మరియు 6 కల్వర్ట్ లను ప్రారంభించారు. నంద్యాల మున్సిపాలిటీ పరిధిలోని స్థానిక 14 వార్డు సరస్వతి నగర్ లో గడప గడపకు మన ప్రభుత్వం నిధుల ద్వారా సి.సి రోడ్ మరియు కల్వర్టులను కౌన్సలర్ విమలమ్మ మరియు వార్డు ఇంచార్జ్ సోమశేకర్ రెడ్డి ఆధ్వర్యంలో నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవి చంద్రకిషోర్ రెడ్డి పైలాన్ ఆవిష్కరించి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పలువురు వైయస్సార్ కాంగ్రెసు పార్టీ కౌన్సిలర్లు కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీ సత్యసాయి బాబా జన్మదిన సందర్భంగా ఆయుష్ యోగా సేవా సమితి ఆధ్వర్యంలో రక్తదానం



నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 24 విభారె న్యూస్ :-భగవాన్ శ్రీ సత్యసాయిబాబా జన్మ దినోత్సవం పురస్కరించుకుని ఆయుష్ యోగా సేవా సమితి సభ్యుల ఆధ్వర్యంలో సోమవారం ఆయుష్ యోగా కేంద్రంలో రక్తదాన శిబిరం నిర్వహించినట్లు నిర్వాహకులు ఖండే ఆనంద్ గురూజీ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయుష్ యోగా సేవా సమితి సభ్యులు 25 మంది రక్తదానం చేసినట్లు ఆనంద్ గురూజీ తెలిపారు. అలాగే శాంతిరాం ఆసుపత్రి సహకారంతో బీపీ, ఆర్బిఎస్, బిఎంఇ, కిడ్నీ, లిపిడ్ ప్రొఫైల్, గుండెకు సంబంధించిన ఈసీజీ, టుడి ఎకో పరీక్షలు, మహిళలకు థైరాయిడ్ పరీక్షలు సుమారు రూ. 2వేలు విలువ గలవి కేవలం రూ.450లకే చేశామన్నారు. దాదాపు వంద మంది వరకు ఈ పరీక్షలను చేయించుకున్నట్లు ఆయన తెలిపారు. యోగాతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మీ ఆరోగ్యం మీ చేతుల్లో అనే నినాదంతో ప్రతి ఒక్కరికి యోగాతో పాటు మూడు పూటలా వారికి కావలసిన సాత్వికాహారాన్ని ఎటువంటి లాభాపేక్ష లేకుండా వారికి అందిస్తూ నిత్యసాధన చేపిస్తున్నామని, అలాగే కార్పొరేట్ ఆసుపత్రిలో అధిక మొత్తం ఫీజులు చెల్లించకుండా ఇక్కడే సాధారణ ఫీజులతో వారికి అన్ని రకాల పరీక్షలు ప్రివెంటివ్ మెడిసిన్ చేపించి వారికి జబ్బులుంటే కూడా వాటిని అదుపులోకి తెచ్చేందుకు తమ వంతు కృషి చేస్తున్నామని ఆయన వివరించారు.

## మితిమీరిపోతున్న దొంగల ఆగడాలు

బేతంచర్ల, బేతంచర్ల మండలంలో రోజురోజుకు దొంగల ఆగడాలు మితిమీరి పోతున్నాయి. మొన్నటికి మొన్న. అంగన్వాడి టీచర్ మెడలోని గొలుసు దొంగతనం చేశారు. అది మరవకముందే బేతంచర్ల లో సెల్ఫోన్ దొంగతనాలు. అధికమై పోతున్నాయి. యువత చెడు వ్యసనాలకులోనై దొంగతనాలకు పాల్పడుతున్నారు. పోలీస్ శాఖ వారు దొంగతనాలు జరగకుండా అడ్డుకట్ట వేయాలని పట్టణ ప్రజలు కోరుకుంటున్నారు. ఆడవారు అయితే ఫంక్షన్లకు వెల్లెటప్పుడు మెడలో గొలుసు వేసుకోవాలంటే భయపడుతున్నారు.

# దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉంది



కర్నూల్ ప్రతినిధి ఏప్రిల్ 24..విబారే న్యూస్ దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందనీ మాజీ రాజ్యసభ సభ్యులు రాష్ట్ర కాంగ్రెస్ మీడియా చైర్మన్ శ్రీ యన్ తులసి రెడ్డి విమర్శించారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో తులసి రెడ్డి మాట్లాడుతూ బిజెపి రాజకీయ కక్ష సాధింపులు రోజురోజుకి పెరుగుతున్నాయని దానికి ఉ దాహరణ రాహుల్ గాంధీ గారిని అరెస్ట్ చేయడం ఒక చిన్న కారణాన్ని పట్టుకొని రాహుల్ గాంధీ గారికి రెండు సంవత్సరాల జైలు శిక్ష విధించి దాని సాకుగా పెట్టుకొని పార్లమెంట్ సభ్యత్వం రద్దు చేశారని దాని సాకుగా పెట్టుకొని ప్రభుత్వ బంగ్లాను ఖాళీ చేయించారని దేశంలో ప్రధానమంత్రి పదవిని త్యాగం చేసిన రాహుల్ గాంధీ ప్రభుత్వ బంగ్లాలు ఖాళీ చేయడం కాదు రాహుల్ గాంధీ కోట్లాది ప్రజల గుండెల్లో వారికి సదనాలు కడతారని రాహుల్ గాంధీ గారి ముత్తాత మోతిలాల్ నెహ్రూ ని మన దేశం కోసం కొన్ని కోట్ల ధనాన్ని ఆనాడే దానం చేశారని వాళ్ళ తాత జవహర్లాల్ నెహ్రూ ఈ దేశ స్వాతంత్ర్యం కోసం 9 సంవత్సరాలు దుర్భరణ జీవితాన్ని గడిపారని, నానమ్మ ఇందిరమ్మ సమైక్యత సమగ్రత కోసం ఆత్మబలిదానం చేశారని నాన్న రాజీవ్ గాంధీ దేశ సమైక్యత సమగ్రత కోసం ప్రాణాలు అర్పించారని, తల్లి

### రాష్ట్ర కాంగ్రెస్ మీడియా చైర్మన్ ఎన్ తులసి రెడ్డి

సోనియా గాంధీ గారు ప్రధానమంత్రి పదవిని త్యాగం చేసిన త్యాగశీలి అని రాహుల్ గాంధీ 2004 నుండి 2014 వరకు ఏ సమయంలో అయినా ఏ క్షణంలోనైనా ప్రధానమంత్రి పదవి చేపట్టే అవకాశం ఉన్న చేపట్టలేదని ప్రధాన మంత్రి పదవిని త్యాగం చేసిన త్యాగమూర్తి రాహుల్ గాంధీ దేశభక్తుల కుటుంబంలో పుట్టినా రాహుల్ గాంధీ పైన ఈ బీజేపీ ప్రభుత్వం మోడీ గారు రాజకీయ కక్ష సాధింపు చేపడుతున్నారని విమర్శించారు. గతంలో ఈ బీజేపీ ప్రభుత్వం ఇందిరా గాంధీ గారిని జైలులో పెట్టి రాజకీయంగా వేధించారని తర్వాత ప్రజల అండదండలతో అఖండ విజయంతో ఇందిరాగాంధీ గారు గెలిచారని. మళ్లీ చరిత్ర పునరావృతం అవుతుందని రాహుల్ గాంధీ గారు అఖండ విజయంతో ప్రధానమంత్రి అవుతారని రవి అస్తమించని బ్రిటిష్ వారిని తరిమికొట్టిన ఈ కాంగ్రెస్ పార్టీ బిజెపి ప్రభుత్వమంటే ఒక లెక్కన అని ఎద్దేవా చేశారు. వినాశకాలే విపరీత బుద్ధి అని ఈ బీజేపీ ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపు చేస్తుందని 2024 లో ప్రధానమంత్రి రాహుల్ గాంధీ అవుతారని 2024లో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఆరు సూత్రాల పథకాన్ని అమలు చేస్తుందని మొదటి సూత్రం రైతులకు వ్యవసాయ రుణాలు ఆరు లక్షల వరకు మాఫీ చేస్తామని రెండవ సూత్రం మహిళలకు 500 కే గ్యాస్ సిలిండర్లు ఇస్తామని మూడవ సూత్రం మధ్యతరగతి కుటుంబాలకు 6000 రూపాయలు ఇస్తామని నాలుగో సూత్రం ప్రత్యేక హోదా ఇచ్చి యువతకు నిరుద్యోగ సమస్యలు పోగొడతామని ఐదవ సూత్రం ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం తీసుకొచ్చి నిలిచిపోయిన సమస్యలన్నీ పరిష్కరిస్తామని ఆరవ సూత్రం విశాఖపట్నంకు విజయవాడకు మెట్రో తీసుకొచ్చి పోలవరం ప్రాజెక్ట్ పూర్తి చేస్తామని తులసి రెడ్డి గారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిసిసి ప్రధాన కార్యదర్శి కే సత్యనారాయణ గుప్త, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు బి బతుకన్న జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు ఎన్ సి బజారన్న సిటీ మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ ఖాజా హుస్సేన్ సిటీ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎస్ ప్రమీల అమర్నాథ్ రెడ్డి ఉత్తన్న శివ నాగార్జున మొదలగు వారు పాల్గొన్నారు.

# ప్రభుత్వాన్ని మభ్యపరిచే కార్యక్రమాన్ని ఇకనైనా ప్రజాప్రతినిధులు మానుకోవాలి ....

### --బొజ్జా దశరథరామిరెడ్డి.



నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 24 విభారె న్యూస్ :-నంద్యాల ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, రాజకీయ అభివృద్ధిలో చారిత్రాత్మిక నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంకు గణనీయమైన పాత్ర ఉందని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం నంద్యాల రాయలసీమ సాగునీటి సాధన సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దశరథరామిరెడ్డి మాట్లాడుతూ..అభివృద్ధి ఇంజిన్గా పనిచేసిన వ్యవసాయ పరిశోధనా స్థానం వలన ఈ ప్రాంతం విత్తన కేంద్రంగా అభివృద్ధి చెందిందనీ, దీనితో ఈ ప్రాంతంలో అనేక విత్తన, వర్తక, వాణిజ్య సంస్థల అభివృద్ధి, అనేక మందికి ప్రత్యక్ష పరోక్ష ఉద్యోగ అవకాశాలు కల్పించడంతో పాటు కొందరు వ్యక్తులు ఆర్థికంగా, రాజకీయంగా ఎదగడానికి కూడా నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం దోహదపడిందని ఆయన తెలిపారు. నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం భూములను వైద్య కళాశాల నిర్మాణానికి కేటాయించడం వలన జరిగే నష్టాన్ని ప్రజలు గ్రహించడానికి బీహార్లోని ఇంపీరియల్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ కథ గురించి ప్రజలందరూ తప్పక తెలుసుకోవాలని ఆయన అన్నారు. అప్పటి భారత దేశ వైస్రాయ్ లార్డ్ కర్జన్ భార్య అభ్యర్థన మేరకు ఆమె సమీప బంధువు అమెరికన్ వ్యాపారవేత్త మిస్టర్ హెన్రీ ఫిప్స్ అందించిన నిధులతో 1905 లో పూసా ఇన్స్టిట్యూట్ గా పిలవబడే ఇంపీరియల్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ స్థాపించబడిందనీ, ఈ క్రమంలో బ్రిటిష్ ప్రభుత్వం నంద్యాల మరియు అనకాపల్లిలలో వ్యవసాయ పరిశోధనా సంస్థలను ఏర్పాటు చేసిందని ఆయన అన్నారు. భూకంపం కారణంగా బీహార్ లోని పూసా ఇన్స్టిట్యూట్ భవనాలు 1934 లో ధ్వంసమవ్వడంతో ఈ ఇన్స్టిట్యూట్ ను డిల్లీకి తరలించారని ఆయన పేర్కొన్నారు. ఈ ఇన్స్టిట్యూట్ బీహార్ నుండి డిల్లీకి మారిన తరువాత, బీహార్ వ్యవసాయ పరిస్థితి దిగజారడమేగాక పురోగతి కూడా మందగించిందని తెలిపారు. నంద్యాల, అనకాపల్లి మరియు మచిలిపట్నం వద్ద వ్యవసాయ పరిశోధనా సంస్థలకు చెందిన భూములలో వైద్య కళాశాలలను నిర్మించాలని ప్రభుత్వం ప్రతిపాధించినప్పుడు, 1934 లో పూసా, బీహార్ను తాకిన భూకంపం కంటే ఈ చర్యలు తక్కువ కాదని గ్రహించి, ఈ విధ్వంసకర చర్యను ఆపడానికి రాయలసీమ సాగునీటి సాధన సమితి అనేక ప్రయత్నాలు చేసిందని దశరథరామిరెడ్డి గుర్తు చేసారు. ఈ ప్రయత్న పలితంగా ముఖ్యమంత్రి గారితో రైతు నాయకులకు ముఖాముఖి సమావేశం ఏర్పాటు చేస్తామని ప్రజా ప్రతినిధులు హామీ ఇచ్చారని, కానీ ఆ హామీని వారు నెరవేర్చక ముఖంచాటు వేసారని ఆయన ధ్వజమెత్తారు. ఈ నేపథ్యంలో రాయలసీమ సాగునీటి సాధన సమితి ఏడాది పొడవునా నిరసన కార్యక్రమాలు చేపట్టడంతో పాటు, పాలకుల అభివృద్ధి నిరోధక చర్యలను ఆపడానికి బహిరంగ బిక్షాటన కార్యక్రమాలు చేపట్టామని ఆయన అన్నారు. ఈ ప్రయత్నాలు ఫలించని నేపథ్యంలో రాయలసీమ సాగునీటి సాధన సమితి హైకోర్టుకు వెళ్ళవలసి వచ్చిందని ఆయన అన్నారు.

# జీనియస్ గ్లోబల్ జూనియర్ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

ఎమ్మిగనూరు ఎమ్మిగనూరు పట్టణంలోని గాంధీ నగర్ లో ఉన్న జీనియస్ గ్లోబల్ జూనియర్ కళాశాల యాజమాన్యం పై చర్యలు తీసుకోవాలని మండల తహశీల్దార్ జయన్న గారికి బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ విద్యార్థి సమైక్య ఆధ్వర్యంలో విన్నవించడం జరిగింది , ఈ సందర్భంగా బీసీ ఎస్సీ ఎస్టీ. మైనారిటీ విద్యార్థి సమైక్య జిల్లా అధ్యక్షులు శేఖర్ , డివిజన్ అధ్యక్షులు ఇస్మాయిల్ మాట్లాడుతూ ఎమ్మిగనూరు పట్టణంలో గాంధీనగర్లో ఉన్న జీనియస్ గ్లోబల్ జూనియర్ కళాశాల కు ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా విద్యాశాఖ అధికారుల కళ్ళుగప్పి కళాశాల యాజమాన్యం తమ కళాశాలకు ప్రభుత్వ అనుమతులు ఉన్నాయని చెప్పి తప్పుడు ప్రచారాలతో రంగురంగుల పాంప్లెట్ లతో ఐఐటి. జే ఈ ఈ. ఎన్ ఈ ఈ టి , కోచింగ్లు ఇస్తామని చెప్పి విద్యార్థులను విద్యార్థుల తల్లిదండ్రులను మభ్యపెడుతూ అధిక ఫీజుల పేరుతో అక్రమ అడ్మిషన్లు నిర్వహిస్తున్న జీనియస్ గ్లోబల్ జూనియర్ కళాశాలపై చర్యలు తీసుకొని యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సంతోష్, గని మంజు , తదితరులు పాల్గొన్నారు

# ఎల్లమ్మ గుట్ట తాండ గ్రామ పంచాయతీకు జిల్లా స్థాయి పురస్కారం

తుగ్గలి తుగ్గలి మండల పరిధిలోని గల ఎల్లమ్మ గుట్ట తాండ గ్రామ పంచాయతీ పిల్లల స్నేహ పూర్వక గ్రామ పంచాయతీగా జిల్లా స్థాయిలో ఎన్నికయిందని ఎంపీడీవో మహబూబ్ బాషా తెలియజేశారు. ఉత్తమ గ్రామ పంచాయతీగా ఎన్నికైనందున ఎల్లమ్మ గుట్ట తాండ గ్రామ సర్పంచ్ గౌరవ సలహాదారులు బాబు నాయక్,పంచాయతీ కార్యదర్శి గోపాల్ లు కర్నూలు నందు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. తుగ్గలి మండల పరిధిలోని గిరిజన గ్రామపంచాయతీ ఎల్లమ్మ

### జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డులు అందుకున్న సర్పంచ్ సలహాదారులు బాబు నాయక్, పంచాయతీ కార్యదర్శి గోపాల్

గుట్ట తాండ కు జిల్లా స్థాయి అవార్డు రావడం చాలా సంతోషకరమని తుగ్గలి మండల ఎంపీడీవో మహబూబ్ బాషా, వీర్రాజులు సంతోషం వ్యక్తం చేశారు.

# జిల్లా పోలీసు స్పందనకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలి

### ---కె. రఘువీర్ రెడ్డి నంద్యాల జిల్లా ఎస్పీ




నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 24 విభారె న్యూస్ :-చట్టపరంగా విచారణ జరిపి సత్వర న్యాయం చేస్తాం అని జిల్లా ఎస్పీ. శ్రీ కె.రఘువీర్ రెడ్డి అన్నారు. నంద్యాల జిల్లా బొమ్మల సత్రం వద్ద గల జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఫిర్యాదిదారుల నుంచి నంద్యాల జిల్లా ఎస్పీ శ్రీ కె.రఘువీర్ రెడ్డి 25 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుండి విచ్చేసిన ఫిర్యాదిదారుల సమస్యలను జిల్లా ఎస్పీ గారు అడిగి తెలుసుకుని సంబంధిత అధికారులతో స్వయంగా ఫోన్ లో మాట్లాడి చట్టపరిధిలో ఫిర్యాదిదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు .చట్ట పరిధిలో చట్టపరంగా ఉన్న సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని ,స్పందన ఫిర్యాదులను మళ్ళీ పునరావృతం కాకుండా చూడాలని ,స్పందన పిర్యదుల పట్ల నిర్లక్ష్యం గా వ్యవహరించరాదని 'స్పందన' ఫిర్యాదులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్ణీత సమయంలో వాటిని పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్ లో మాట్లాడి పరిష్కారం చూపాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎక్కువగా సివిల్ తగాదాలు, అన్నదమ్ముల మధ్య ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు ,అత్తరింటి వేదింపులు మొదలగు ఫిర్యాదులు ఉన్నాయి. ఫిర్యాదుల పై అధికారులు తీసుకున్న చర్యలను జిల్లా కార్యాలయానికి ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని మరియు ప్రతి సోమవారం ప్రతి పోలీసు స్టేషన్, సర్కల్ ఆఫీసు, డిఎస్పి ఆఫీసులలో స్పందన కార్యక్రమం నిర్వహించి జిల్లా పోలీసు కార్యాలయానికి సంబందిత సమాచారం అందించాలని జిల్లా ఎస్పీ గారు తెలియజేశారు. నంద్యాల జిల్లా ఎస్పీ గారు స్పందకు వచ్చిన ఫిర్యాదిదారులకు ఓంకారం ధేవస్థానం వారిచే భోజన వసతి ఏర్పాటు చేసినారు.

# నంద్యాల జిల్లాలో మద్యం (ఎక్సైజ్ )కేసుల నందు పట్టుబడిన వాహనాల వేలం.....

### జిల్లా ఎస్పీ శ్రీ కె. రఘువీర్ రెడ్డి




నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 24 విభారె న్యూస్ :- నంద్యాల జిల్లాలోని పరిధిలో మద్యం(ఎక్సైజ్ ,సారాయి)కేసులలో పట్టుబడిన వాహనాలు బైకులు ,కారు,ఆటో మొదలైన వాటిని జిల్లాలోని అన్ని సబ్ డివిజన్ లో పోలీసు వారి ఆధ్వర్యంలో వేలంపాట వేయనున్నారు. ఈ వేలంపాటయందు పాల్గొని వేలంపాటలో గెలుపొంది వాహనం దక్కించుకున్న వ్యక్తి వారు పాడిన వేలం పాట యొక్క డబ్బులతో పాటు జీ ఎస్టీ . కూడా చెల్లించవలసి ఉంటుంది.వేలం పాట వేయు ప్రదేశాలు,వివరాలు నంద్యాల సబ్ డివిజన్ నందు 27-04-2023 న జిల్లా పోలీసు ఆఫీసు పక్కన గల గ్రౌండ్ నందు వేలం వేయనున్నారు.? ఆళ్లగడ్డ సబ్ డివిజన్ నందు 28-04-2023 న ఆళ్లగడ్డ రూరల్ పోలీసు స్టేషన్ నందు వేలం వేయనున్నారు.? డోన్ సబ్ డివిజన్ నందు 28-04-2023 న బనగానపల్లె పోలీసు స్టేషన్ నందు వేలం వెయనున్నారు.? ఆత్మకూర్ సబ్ డివిజన్ నందు 27-04-2023 న ఆత్మకూర్ పోలీసు స్టేషన్ నందు వేలం వెయనున్నారు.మరియు 28-04-2023న బ్రహ్మణకొట్కూర్ పోలీసు స్టేషన్ కు నందికొట్కూర్ కు సంబందించినవి నందికొట్కూర్ నందు వేలం వేయనున్నారు.వివరాలకొరకు సంబందిత ఆఫీసు కానిస్టేబుల్ వారిని సంప్రదించవలెనని తెలిపారు. .

## బహిరంగ సభ విజయవంతం చేయండి

### కిల్లో సురేంద్ర పి.బాలదేవ్

అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయ మండలం చిన లబుడు పద్మాపురం పంచాయతీ పరిధిలో ఉపాధి హామీ కూలీల వద్ద ప్రచారం నిర్వహిస్తూ గిరిజన హక్కుల కోసం చట్టాలు అమలుపై అరకులోయ లో నేడు జరిగే బహిరంగ సభలో ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారుజీవో నెంబర్ 3 చట్టబద్ధం కల్పించి నూటికి నూరు శాతం ఉద్యోగాలు గిరిజనులకు ఇవ్వాలని బోయ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేరుస్తూ రాష్ట్ర ప్రభుత్వం చేసిన అసెంబ్లీ తీర్మానం రద్దు చేయాలని గిరిజన ఎమ్మెల్యేలు గిరిజనులకు తీవ్రమైన అన్యాయం చేసి గిరిజనుల మనుగడకు నష్టం వాటిల్ల విధంగా తీర్మానాన్ని బలపరచడం అత్యంత దుర్మార్గమని గిరిజన ఎమ్మెల్యేలు తమ పదవులకు రాజీనామా చేసి గిరిజనుల పక్షాన ఉంటారా లేదా గిరిజన ద్రోహులుగా మిగిలిపోతారా తేల్చుకోవాలని అన్నారు.కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు బడ్జెట్లో కోత విధించిందని కూలీలకు 200 రోజులు పని రోజుకు 600 కూలి ఇవ్వాలని పని పరికరాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారుఈ కార్యక్రమంలో ఉపాధి కూలీలు శ్రీను నర్సింగు రామారావు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190